తెలుగు దిన పత్రిక

http://aksharagalam.com

# అక్షరగళం

నిజం..నిర్భయంగా

హైదరాబాద్ | శుక్రవారం | 09-01-2025 | సంపుటి-03 | సంచిక-215 | పేజీలు - 08 | వెల:3/–


## మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయ పలకరింపు



**అక్షరగళం,గజ్వేల్:** ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం పలికారు.

# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

### అధికారం ఉందని మోడీ ఇష్టారీతి నిర్ణయాలు



పేదల పొట్టకొట్టే యత్నం చేసిన మోడీ

ఉపాధితో పేదరిక నిర్మూలనకు అడుగులు

పంచాయితీ ఎన్నికల మాదిరే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం

సిఎం రేవంత్ రెడ్డి పిలుపు

**అక్షరగళం, హైదరాబాద్,జనవరి8:** పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం అని అన్నారు. మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే మిగతా 2లో



## నకిలీ ప్రభుత్వ ఉద్యోగాలతో మోసం

ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈడీ దాడులు

ఈడీ దాడులపై మండిపడ్డ బెంగాల్ సిఎం మమత

**అక్షరగళం, న్యూఢిల్లీ,జనవరి8:** ఒక వ్యవస్థీకృత ముఠా నిర్వహిస్తున్న నకిలీ ప్రభుత్వ ఉద్యోగాల కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం ఆరు రాష్ట్రాల్లో సోదాలు జరిపింది. బీహార్‌లోని ముజఫర్‌పూర్, మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికలతో కాంగ్రెస్ సన్నద్ధం

మరోమారు ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళికలు

ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలకు ప్లాన్

ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు సభల నిర్వహణ

సభల నిర్వహణ బాధ్యత మంత్రి పొంగులేటికి అప్పగింత



**అక్షరగళం, హైదరాబాద్,జనవరి8:** రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను మిగతా 2లో



### టెలీమెట్రీల ఏర్పాటులో నిర్లక్ష్యం

02

నిధులు దారిమళ్లినా ప్రభుత్వం చోద్యం

కెఆర్ఎంబి తీరుపై మండిపడ్డ హరీష్ రావు

## కృష్ణా జలాలపై పదేపదే రాజకీయాలు



పాలమూరు`రంగారెడ్డికి విభజన చట్టంలో ప్రతిపాదన ఏదీ

కెసిఆర్ 229 టిఎంసిలు చాలని సంతకం పెట్టలేదా?


జగన్‌తో కలసి ఏం మాట్లాడారో బయటపెట్టాలి

02

బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు

## ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

సంతాపం ప్రకటించిన జైరామ్ రమేశ్



**అక్షరగళం, పూనె,జనవరి8:** ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ (82) కన్నుమూశారు. ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూనెలోని తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు సిద్దార్థ్ గాడ్గిల్ గురువారం మిగతా 2లో

## భారత్‌పై పేలనున్న మరో బాంబ్

ఏకంగా 500 శాతం సుంకాల విధింపునకు రెడీ

బిల్లును సిద్దం చేసిన అమెరికా



**అక్షరగళం, వాషింగ్టన్,జనవరి8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరో బాంబు వేసేందుకు రెడీ అవుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై ఏకంగా 500 శాతం సుంకాలు విధించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు కీలక బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయంపై రిపబ్లికన్ సెనెటర్ లిన్స్ గ్రాహం ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ట్రంప్‌తో జరిగిన మిగతా 2లో



### బిచ్చగాడి మృతి.. 4.5 లక్షల నగదు లభ్యం

డబ్బాల్లో దాచుకున్న నగదు గుర్తించిన పోలీసులు

**అక్షరగళం, తిరువనంతపురం,జనవరి8:** కేరళలో ఓ బిచ్చగాడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అయితే అతని వద్ద ఉన్న కంటేనర్‌లో సుమారు నాలుగున్న లక్షల నగదును సీజ్ చేశారు. అలప్పుజాలో ఈ ఘటన జరిగింది. వాస్తవానికి ఆ ప్రాంత ప్రజలకు ఆ యాచకుడు సుపరిచితం. రోజూ అతను ఆ ఏరియాలోనే అడుక్కుంటూ తిరుగుతుంటాడు. అయితే మిగతా 2లో

## సిపిఐ వందేళ్ల ప్రస్థానంపై ఖమ్మంలో సభలు

18న ఖమ్మంలో భారీ ర్యాలీకి సన్నాహాలు

19, 20, 21 తేదీల్లో జాతీయ కౌన్సిల్ సమావేశం

సిపిఐ జాతీయ నాయకులు హాజరు

సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ వెల్లడి




**అక్షరగళం, ఖమ్మం,జనవరి8:** సిపిఐ వందేళ్ల ప్రస్థానం పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ఈ నెల 18వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. సీపీఐ జాతీయ నాయకులంతా ఈ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. 18వ తేదీన నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సంఘీభావంగా ఈ ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లాలో రామకృష్ణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మిగతా 4లో

## రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు



సీమ ఎత్తిపోతలపై దుష్ప్రచారం వెనక కుట్ర

తెలంగాణకు దాసోహమన్న సిఎం చంద్రబాబు

ఎపి ప్రయోజనాలు తాకట్టు పెట్టిన బాబు

రేవంత్ రెడ్డితో బాబు రహస్య ఒప్పందం

ఎస్‌ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు

మీడియా సమావేశంలో జగన్ ఘాటు విమర్శలు

**అక్షరగళం, అమరావతి,జనవరి8:** రాయలసీమ ఎత్తిపోతలపై కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కరువు కోరల్లో చిక్కుకున్న ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలనుకున్నామని అన్నారు. రాయలసీమకు తాము తలపెట్టిన ఎత్తిపోతల.. సంజీవని లాంటిదని చెప్పుకొచ్చారు. నెల్లూరు, రాయలసీమ ప్రజలు చంద్రబాబును విలన్‌లా చూస్తున్నారని ఆరోపించారు. సీఎం సీట్లో కూర్చుని చంద్రబాబు ఏపీ ప్రయోజనాలను తాకట్టుపెట్టారని విమర్శించారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ మోహన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'సొంత రాష్ట్రాన్ని తన స్వార్థ ప్రయోజనాలకు తాకట్టుపెట్టారు. రాయలసీమ ఎత్తిపోతలపై రేవంత్ వ్యాఖ్యలే సాక్ష్యం. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు రహస్య ఒప్పందానికి అధికార ముద్ర వేశారు. రాయలసీమ లిఫ్ట్ మిగతా 2లో



### మోకిల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

చెట్టును ఢీకొన్న విద్యార్థుల కారు

నలుగురు ఐసీఎఫ్ఏఐ వర్సిటీ విద్యార్థులు దుర్మరణం

**అక్షరగళం, రంగారెడ్డి,జనవరి8:** రంగారెడ్డి జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడటంతో నలుగురు విద్యార్థులు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ ఐసీఎఫ్ఏఐ వర్సిటీ విద్యార్థులు శ్రీ నిఖిల్, సూర్యతేజ, సుమిత్, రోహిత్, నక్షత్ర కలిసి కోకాపేటలో మిగతా 2లో

# రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు

(మొదటిపేజీ తరువాత)

అవసరం లేదని మంత్రులు మాట్లాడుతున్నారు. రాయలసీమ లిఫ్ట్ వెనుక గొప్ప ఉద్దేశ్యం ఉంది. రాయలసీమ ఎత్తిపోతల ఆపమని కోరినట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. రేవంత్ వ్యాఖ్యలు చూస్తే చంద్రబాబు ఏపీని అమ్మకానికి పెట్టారని చెప్పడానికి నిదర్శనం. శ్రీశైలంలో 881 అడుగులు ఉంటేనే పోతిరెడ్డిపాడుకు నీళ్లు వస్తాయి.. పోతిరెడ్డిపాడు నుంచి 101 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. ఇరవై ఏళ్లలో మూడు, నాలుగుసార్లే అన్ని నీళ్లు తెచ్చుకోగలిగాం' అని అని వైఎస్ జగన్ తెలిపారు. 800 అడుగుల్లోపే 2 టీఎంసీల నీళ్లు తీసుకునేందుకు.. తెలంగాణలో పాలమూరు`రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టారు. ఎస్ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు జరుగుతున్నాయి.777 అడుగుల నుంచే లెఫ్ట్ పవర్‌హౌస్ ద్వారా..4 టీఎంసీల నీళ్లు తెలంగాణ ఖాళీ చేస్తున్న పరిస్థితి. మనకు నీళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్నాం. తెలంగాణలో పవర్‌హౌస్ ద్వారా ఇష్టారీతిన నీళ్లు తీసుకుంటున్నారు. తెలంగాణలో లిఫ్ట్‌లు, పవర్‌హౌస్‌తో రోజుకు 8 టీఎంసీలు తీసుకుంటున్నారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల పవర్‌హౌస్‌లు తెలంగాణెళి ఆపరేట్ చేస్తోంది. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియోలతో అడ్డంగా దొరికారు. అందుకే చంద్రబాబు నోరు మెదపలేని పరిస్థితి ఉందని జగన్



ఎద్దేవా చేశారు. మేం వచ్చే నాటికే తెలంగాణలో లిఫ్ట్‌ల పనులు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లేవని వైఎస్ జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు దగ్గరుండి రాయలసీమ లిఫ్ట్ ను ఖూనీ చేశారన్నారు. చంద్రబాబు, ఆయన మంత్రి కలిసి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అక్కర్లేదని మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. స్టెబిలైజింగ్ రిజర్వాయర్లు కట్టకపోతే కుప్పానికే కాదు చిత్తూరు జిల్లాకు తాగునీళ్లు ఉండవని జగన్ తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచను అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు బాదుడే బాదుడుతో ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు గడవక ముందే రాష్ట్రం రూ. 3 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల దిశగా నడిపిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని కోరారు. మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.. కానీ లాభాలు మాత్రం ప్రైవేటు వాళ్లకే. ఇది స్కాం కాక మరేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు స్కాంలకు కాదేది అనర్హమని అన్నారు. ఇసుక.. లిక్కర్.. ఆఖరికి రేషన్ బియ్యంలోనూ స్కాంలేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 19 నెలల్లోనే స్కామాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని తెలిపారు. ప్రజల నుంచి దోచుకోవడానికి దొడ్డిదారులు వెతుకుతున్నారని, చార్జీలు, టోల్‌లు, సెస్‌ల పేరుతో ఇష్టమొచ్చినట్లు జనాలపై ఆర్థిక భారం మోపుతున్నారని తెలిపారు. బాదుడుతో సంపద సృష్టిస్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో రాయలసీమలో ఉన్న ఏ ప్రాజెక్టునూ పూర్తిగా వాడుకోలేని పరిస్థితులు ఉండేవని, 40ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీళ్లు నింపలేకపోయారని తెలిపారు. ఎన్జీటి అభ్యంతరాల తర్వాత కేంద్రం నుంచి ఎక్స్పర్ట్ అప్రైజల్ కమిటీ మూడుసార్లు సమావేశమైతే రాష్ట్రం తరఫున చంద్రబాబు కనీసం నోరు మెదపలేదని జగన్ తెలిపారు.

# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

(మొదటిపేజీ తరువాత)

కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిదని అన్నారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని భాజపా నేతలు ప్రచారం చేశారు. అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారు. తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారు. కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో భాజపా 240 సీట్ల వద్ద ఆగిపోయింది. దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిరది. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు.ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిరదని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం



రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభ మవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ`అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చిన వేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చిన వారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.



# నకిలీ ప్రభుత్వ ఉద్యోగాలతో మోసం

(మొదటిపేజీ తరువాత)

మొతిహరి, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా, కేరళలోని ఎర్నాకులం, పండలం, అడూర్ మరియు కోడూర్, తమిళనాడులోని చెన్నై, గుజరాత్‌లోని రాజ్‌కోట్, ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ప్రయాగ్‌రాజ్ మరియు లక్నోలోని 15 ప్రదేశాల్లో సోదాలు కొనసాగుతున్నట్లు ఇడి అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలో మొదట ఈ కుంభకోణాన్ని గుర్తించినప్పటికీ, అటవీ, పోస్ట్, ఐటి, హైకోర్టు, ప్రజా ప్రనుల శాఖ, బీహార్ ప్రభుత్వం, ఢిల్లీ అభివృద్ధి అథారిటీ, రాజస్థాన్ సెక్రటేరియట్, ఇతర ప్రభుత్వ సంస్థలు సహా 40కి పైగా విభాగాల్లో ఈ స్కామ్ జరిగినట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. ఈ ముఠా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లను అనుకరిస్తూ నకిలీ ఇమెయిల్ ఖాతాలను వినియోగించి మోసపూరిత జాయినింగ్ లెటర్స్ పంపిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమ్మించేందుకు రైల్వేలు, ఇతర సంస్థల్లో నియమించిన కొంతమంది బాధితులకు ఈముఠా రెండు నుండి మూడు నెలల వరకు జీతాల చెల్లింపులు కూడా చేశాయని అన్నారు. కోల్‌కతాలో కొనసాగుతున్న ఇడి దాడులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు రాజకీయ ప్రేరేపితమని, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఐ`ప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంలో జరిగిన సోదాల్లో ఇడి అధికారులు టిఎంసి హార్డ్ డిస్క్‌లు, అంతర్గత పత్రాలు, రహస్య డేటాను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని అన్నారు. జైన్ నేతృత్వంలోని కన్సల్టెన్సీ సంస్థ ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ కార్యాలయంలో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కి చెందిన ఐటి సెల్‌ను కూడా ఐ`ప్యాక్ నిర్వహిస్తోంది. అధికార పార్టీ అంతర్గత వ్యూహం, అభ్యర్థుల జాబితాలు, గోప్యమైన డిజిటల్ మెటీరియల్‌ను ఇడి యాక్సెస్ చేసేందుకు యత్నిస్తోందని, ఆ సమాచారానికి, ఆర్థిక దర్యాప్తుతో సంబంధం లేదని అన్నారు. తమ పార్టీ వ్యూహం, ప్రణాళికలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను తీసుకునేందుకు యత్నిస్తున్నారని అన్నారు. రాజకీయ పార్టీల అంతర్గత పత్రాలను సేకరించడం ఇడి పనా అని కేంద్రాన్ని నిలదీశారు. ఈ ప్రక్రియు బెదిరింపుగా అభివర్ణించారు. ఇది చట్ట అమలు సంస్థ కాదని, రాజకీయ ప్రతీకారమని అన్నారు. హోంమంత్రి దేశాన్ని రక్షించే వ్యక్తిలా కాకుండా అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

# కృష్ణా జలాలపై పదేపదే రాజకీయాలు

**కరీంనగర్,జనవరి8:** కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించలేదన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని మండిపడ్డారు.. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వాడుకోలేదు. అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదు. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటికి అభ్యంతరం చెప్పొద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది. ఆ చట్టంలో పాలమూరు`రంగారెడ్డికి పేరే లేదు. పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారు. దీన్ని గతంలో అడ్డుకోలేదు. కాంగ్రెస్, కేసీఆర్ చేసిన మోసాలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసిందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా జలాల విషయంలో రెండు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుంది.. ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామా ఆడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.ముఖ్యమంత్రి ఇరిగేషన్ విషయంలో అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్దాలు మాట్లాడారన్నారు. మేము నదీజలాలపై కొట్లాడినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫీల్డ్ లో లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అండగా ఉందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ తామే ప్రారంభించామని కాంగ్రెస్ అంటోంది.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పాలమూరు రంగారెడ్డి పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇది మరణశాసనం. వాళ్లే జాతీయ హోదా ఇవ్వలేదు అని లొల్లి చేస్తున్నారన్నారు. రీ ఆర్గనైజ్ యాక్ట్ లో 6 ప్రాజెక్ట్ లు మాత్రమే ఉన్నాయి.. పునర్విభజన చట్టంలో లేని పాలమూరు ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఎలా ఇస్తారు..? అని నిలదీశారు. కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందన్నారు.. పోతిరెడ్డిపాడు విషయంలో ఆ రెండు పార్టీలు నోరు మెదపలేదు. కేసీఆర్ ప్రకటనలకు పరిమితం అయ్యారని బండి సంజయ్ అన్నారు.. కృష్ణా నది మీ జాగీరా? అణు బాంబు అయితా అన్నాడు కేసీఆర్.. అణుబాంబు కాదు తోక పటాక్ కూడా కాలేదు. ఉమాభారతి సమక్షంలో జరిగిన మీటింగ్ లో 299 టిఎంసిలు కృష్ణా నదిలో వాటా చాలు అన్నారు.



దానికి కేసీఆర్ వద్ద సమాచారం లేదు. తెలంగాణకు కృష్ణా జలాల్లో అన్యాయం చేసింది కేసీఆర్? ఈ విషయాన్ని నేనే బయట పెట్టాను.. వెంటనే నేను అన్నది తప్పు అన్నారు కేసీఆర్. ఆంధ్ర వాళ్ళతో కమిట్ అయ్యి.. ఇక్కడ ఉల్టా డైలాగులు కొట్టారు. కాళేశ్వరం అని రూ. లక్ష కోట్లు మింగి కూలేశ్వరం కట్టారు. రెండవ దఫాలో కృష్ణా మీద కన్నేసి.. పాలమూరు రంగారెడ్డి కి సిద్ధమయ్యారు. రూ. 80వేల కోట్ల అంచనాతో మొదలు పెట్టి రూ. 20 వేల కోట్లు ఖర్చు చేశారు. ఇరవై ఏడువేల కోట్లు పెడితే చుక్క నీరు రాలేదు. లిఫ్ట్‌లు రిజర్వాయర్ల కోసం రూ. 80 వేల కోట్లు అని.. ఓ అంచనా లేకుండా రూ. లక్ష 50వేల కోట్లు ఖర్చు అయి ఉంటాయి అన్నారు. కృష్ణా జలాల విషయంలో 2016, 2020 లో రెండుసార్లు అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ జరిగింది. మొదటిసారి మిస్టేక్ అనుకుందాం? రెండోసారి మీటింగ్ 2020 లో జరిగింది?.అప్పుడైనా సరిదిద్దుకోవాలి కదా.. ఆ మీటింగ్ లో కూడా 299 టీఎంసీలకే ఒప్పుకున్నారు.. జగన్ ప్రగతి భవన్ కి వచ్చారు.. ఇద్దరూ కలిసిన విషయం ఫార్మాలిటీ అన్నారు.. ఆనాడు నేను ప్రశ్నిస్తే నన్ను విమర్శించారు. వెంటనే బేసిన్లు లేవు భేషజాలు లేవు అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల జరుగుతుంటే ఆపలేదు. రోజా ఇంటికి పోయి రొయ్యల కూర చేపల పులుసు తిని వచ్చారు. రాయలసీమను రత్నాల సీమ చేస్తా అని చెప్పి.. పెద్దన్న పాత్ర పోషిస్తా అన్నారు. కవిత కూడా ఆ రోజు పట్టుబట్టలు పెట్టారు. ఆరోజు జరిగిన సమావేశంలో ఏమి జరిగిందో కవిత బయటపెట్టాలని బండి డిమాండ్ చేశారు. బీజేపీ అండ ఉంది. కవిత దావత్ వద్దన్నదని నాకు సమాచారం ఉంది. ఇప్పుడు చెప్పాలి? రోజా ఇంట్లో నాన్ వెజ్ తిని తిరుమల యాత్ర రద్దు చేసుకున్నారు. రాయలసీమ ఎత్తిపోతల విషయంలో అన్యాయాన్ని నిరసిస్తూ మేము ఇళ్లపై నల్లజెండాలు ఎగరవేశాం.. అని సంజయ్ వెల్లడిరచారు.

# మున్సిపల్ ఎన్నికలతో కాంగ్రెస్ సన్నద్ధం

(మొదటిపేజీ తరువాత)

తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఖరారు చేసింది. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించింది. కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపైనా చర్చించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో గెలుపు బాధ్యతలు తీసుకునేలా దిశానిర్దేశం చేశారు. వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్ట్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది. అంతేకాకుండా.. ఆయా జిల్లాల్లోని స్థానిక సమస్యలతోపాటు పెండిరగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందంటూ ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఇందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.



# బిచ్చగాడి మృతి.. 4.5 లక్షల నగదు లభ్యం

(మొదటిపేజీ తరువాత)

సోమవారం రాత్రి ఆ బిచ్చగాడు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు అయ్యాయి. అతన్ని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో అతని పేరును అనిల్ కిశోర్‌గా నమోదు చేశారు. చికిత్స అనంతరం అతడు ఎవరికీ చెప్పకుండా అక్కడినుంచి వెళ్లిపోయాడు. తన పేరు అనిల్ కిశోర్ అని ఆస్పత్రి అధికారులతో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం ఆ యాచకుడి మృతదేహం ఓ దుకాణం ముందు ఉండటాన్ని మున్సిపల్ అధికారులు గుర్తించి పోస్ట్‌మార్టం కోసం ఆ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. యాచకుడి మృతదేహం సమీపంలో ఓ ప్లాస్టిక్ డబ్బా దొరికింది. తనిఖీ కోసం దాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. అది తెరిచి చూసిన అక్కడి అధికారులు ఒక్కసారిగా షాక్‌కి గురయ్యారు. దానినిండా డబ్బు ఉందని, అది రూ.4.5 లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. స్థానిక పంచాయతీ సభ్యుడు ఫిలిప్ ఉమ్మన్ సమక్షంలో ఆ బిచ్చగాడి కంటేనర్‌ను ఓపెన్ చేశారు. దాంట్లో నగదును గుర్తించారు. ఆ మొత్తం విలువ సుమారు 4.5 లక్షలు ఉన్నట్లు తేల్చారు. సీజ్ చేసిన నగదులో రద్దు అయిన రెండు వేల రూపాయల నోట్లు ఉన్నాయి. ఇంకా విదేశీ కరెన్సీ కూడా ఉన్నది. ప్లాస్టిక్ టిన్నుల్లో నగదును స్టోర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తిండి కోసం కిశోర్ డబ్బులు యాచించేవాడు అని స్థానికులు చెప్పారు. కానీ అతని వద్ద అంత డబ్బు ఉన్న విషయం ఎవరికీ తెలియదన్నారు. అందరూ షాక్‌కు గురైనట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న డబ్బును కోర్టులో జమ చేయనున్నట్లు పోలీసులు చెప్పారు.

# భారత్‌పై పేలనున్న మరో బాంబ్

(మొదటిపేజీ తరువాత)

భేటీలో పలు కీలక విషయాల గురించి చర్చలు జరిపినట్లు తెలిపారు. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు అధ్యక్షుడు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఈ బిల్లుపై వచ్చే వారం ఓటింగ్ జరగనుందని వెల్లడిరచారు. ఉక్రెయిన్‌లో పుతిన్ చేస్తున్న దారుణాలకు రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు పరోక్షంగా మద్దతు ఇస్తున్నాయని గ్రాహం ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా బిల్లు ప్రకారం ఆయా దేశాలపై 500 శాతం సుంకాలు విధించే అధికారం అమెరికాకు ఉంటుందని గ్రాహం తెలిపారు బిల్లు ఆమోదం పొందితే రష్యా నుంచి ఇతర దేశాలు చమురు కొనడం తగ్గుతుందని లిన్స్ గ్రాహం ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొంటున్న దేశాల్లో ప్రస్తుతం చైనా మొదటి స్థానంలోనూ, భారత్ రెండో స్థానంలోనూ ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనడాన్ని ఆపించడానికి ట్రంప్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే



భారత ఉత్పత్తులపై 50 శాతం సంకాలు విధించారు. అయినా భారత్ మాత్రం రష్యా నుంచి చవకగా వస్తున్న చమురును కొనుగోలు చేస్తూనే ఉంది. అందుకే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యాపై బెదిరింపులకు దిగారు. రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై టారిఫ్‌లను విధించేందుకు సిద్ధమయ్యారు. ద్వైపాక్షిక రష్యా ఆంక్షల బిల్లుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేసినందుకు వాణిజ్య భాగస్వాములైన భారత్, చైనా, బ్రెజిల్‌లపై జరిమానా విధించేందుకు ఈ బిల్లును వినియోగించనున్నారు. గ్రాహం`బ్లూమెంటల్ బిల్లు ఆమోదం పొందితే, రష్యా చమురు లేదా యురేనియంను కొనుగోలు చేస్తున్న దేశాలపై 500శాతం వరకు సుంకాలు విధించడానికి అధ్యక్షుడికి అనుమతి లభిస్తుంది. బుధవారం వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమయ్యానని గ్రాహం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ నెలల తరబడి చర్చిస్తున్న బిల్లుకు తన మద్దతు తెలిపారని అన్నారు. వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు మీడియాతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ధృవీకరించారు. వచ్చే వారం ప్రారంభంలో ఓటింగ్ జరగవచ్చని గ్రాహం అన్నారు. ఈ బిల్లుని హౌస్ ఆమోదిస్తే, ప్రస్తుతం పరిశీలిస్తున్న స్కేల్`బ్యాక్డ్ ప్రభుత్వ నిధుల ప్యాకేజీని వచ్చే వారం సెనెట్ చేపట్టనుంది.అంటే రష్యాపై ఆర్థికంగా ఒత్తిడి విధించేందుకు రూపొందించింది. గతంలో ఈ బిల్లులో కొన్ని సవరణలు చేపట్టాలని వైట్‌హౌస్ సూచించింది.

# టెలీమెట్రీల ఏర్పాటులో నిర్లక్ష్యం

**హైదరాబాద్,జనవరి8:** నదీ జలాల వినియోగంలో లెక్కలు తేల్చే టెలిమెట్రీల ఏర్పాటు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. కృష్ణా జలాల వినియోగ లెక్కలు తేల్చేందుకు టెలిమెట్రీల కోసం కేటాయించిన రూ.4.18 కోట్ల నిధులను కేఆర్ఎంబీ దారి మళ్లిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం చోద్యం చూడటం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగానే టెలిమెట్రీల ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేస్తూ.. కృష్ణా జలాలను ఏపీ అక్రమ వినియోగానికి తెలంగాణ ప్రభుత్వం సహకరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్, 2016లో జరిగిన కేఆర్ఎంబీ సమావేశ నిర్ణయం ప్రకారం తొలి దశలో 18 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయగా.. రెండో దశలో 9 చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉందని.. అవి ఇప్పటివరకూ అమలు చేయకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. టెలిమెట్రీ ఏర్పాటు కోసం నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటే ఏపీ ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేదు?.. ఎందుకు ఏపీ మీద ఒత్తిడి చేయకుండా మౌనంగా ఉన్నట్లు? అంటూ రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు నిప్పులు చెరిగారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడాల్సిన ఐఖీఓః.. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని తెలంగాణకు అన్యాయం చేస్తుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ, ఏపీ, కేంద్రంలోని బీజేపీ.. మూడు కలిసి టెలిమెట్రిల ఏర్పాటును నిర్లక్ష్యం చేస్తూ తమ రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెలిమెట్రీలు ఏర్పాటు చేస్తున్నామని ప్రచారం చేసుకోవడమే తప్ప రెండేళ్ల నుంచి కేంద్రం చేసిందేమీ లేదంటూ హరీశ్ రావు ఈ సందర్భంగా పెదవి విరిచారు. సబ్ జ్యూడీస్ అని సాకులు చెప్పే కేంద్రానికి సుప్రీంకోర్టులో కేసు ఉన్నప్పటికీ కేసీఆర్ 18 చోట్ల టెలిమెట్రీలు ఏర్పాటు చేసిన విషయం గుర్తు లేదా? అంటూ సూటిగా ప్రశ్నించారు. పోలవరం`నల్లమల సాగర్ విషయంలో మొద్దు నిద్ర ప్రదర్శించినట్లుగానే, టెలిమెట్రీల ఏర్పాటు విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని వ్యాఖ్యానించారు. రూ.4.18 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులను వెంటనే రికవరి అయ్యేలా చేసి, టెలిమెట్రీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేవలం లేఖలు రాస్తూ కాలయాపన చేయకుండా.. నిధులు మళ్లించిన కేఆర్ఎంబీపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నామని రేవంత్ సర్కార్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు కీలక సూచన చేశారు.



# మోకిల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాత)

పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఓ స్నేహితుడిని డ్రాప్ చేసి తిరిగి మోకిల నుండి హైదరాబాద్ నగరానికి వస్తుండగా గురువారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలోని మీర్జాగూడ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది.. కారు వేగం ఎక్కువగా ఉండటంతో అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వాహనం బోల్తాపడిరది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. నక్షత్ర అనే యువతికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే యువతిని అత్యవసర చికిత్స ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

# ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాత)

వెల్లడిరచారు. మాధవ్ గాడ్గిల్ పశ్చిమ కనుమల పర్యావరణ ప్రాముఖ్యతకు ఆయన విశేష కృషి చేశారు. ప్రపంచ జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన పశ్చిమ కనుమలలో ఆయన చేసిన కృషికి గాను 2024లో ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ గౌరవమైన వార్షిక ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డును బహూకరించింది. యోగా, ఆయన పర్యావరణానికి సంబంధించి విలువైన సిఫార్సులను అందించారు. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో పర్యావరణానికి నష్టం చేకూర్చకుండా కఠినమైన ఆంక్షలను తన నివేదికలో సిఫార్సు చేశారు. వాటిల్లో కొత్త రోడ్లు లేదా భవన నిర్మాణాల కట్టడాలకు అనుమతించరాదని, నిటారుగా ఉన్న వాలులో అభివృద్ధి చేయరాదని, రాతి తవ్వకాలపై నిషేధం విధించాలని ఆయన సిఫార్సు చేశారు. మాధవ్ గాడ్గిల్ మృతికి మాజీ పర్యావరణశాఖా మంత్రి, కాంగ్రెస సీనియర్ నేత జైరాం రమేశ్ సంతాపం తెలిపారు. 'మాధవ్ గాడ్గిల్ ఒక అత్యున్నతస్థాయి విద్యావేత్త, అవిశ్రాంత క్షేత్ర పరిశోధకుడు, మార్గదర్శక సంస్థ నిర్మాత, గొప్ప సంభాషణకర్త, ప్రజల నెట్‌వర్క్‌లు, ఉద్యమాలను దృఢంగా నమ్మిన వ్యక్తి, ఐదు దశాబ్దాలకు పైగా చాలా మందికి స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శి, గురువు. ఆధునిక శాస్త్రంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందిన ఆయన జీవవైవిధ్య పరిరక్షణలో ఛాంపియన్‌గా నిలిచారు' అని జైరాం రమేష్ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే మాధవ్ స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచిపోతారని జైరాం రమేష్ అన్నారు.

# వికేంద్రీకృత పాలనకు ఆటంకం



ఒక వైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను హరిస్తోందని గగ్గోలు పెడుతూ, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలే స్థానిక ప్రభుత్వాల అధికారాలను క్రమంగా కేంద్రీకరిస్తూ వికేంద్రీకరణ పాలనను దెబ్బతీయడం తీవ్రమైన చర్య. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేయడం మాత్రమే కాకుండా, అనేక గ్రామ పంచాయితీలను సమీప మునిసిపాలిటీల్లో కలపడం కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.


ఈ విలీనంపై అన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా విధానపరమైన ప్రక్రియలు, నోటిఫికేషన్లు, వార్డు విభజనలు, జనాభా, పన్నుల సర్దుబాట్లు వంటి అంశాలపైనే చర్చిస్తున్నాయి. కానీ ప్రజాస్వామ్యాన్ని మరింత కేంద్రీకరించే ఈ విధాన దిశ సరైనదేనా? అనే ప్రశ్నను లేవనెత్తకపోవడం అత్యంత ఆందోళనకరం. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన పిటిషనర్లు కూడా రాజ్యాంగ ఆత్మ, వికేంద్రీకరణ పాలన, స్థానిక స్వపరిపాలనపై దెబ్బ వంటి మౌలిక అంశాలను లేవనెత్తలేదు. రాజ్యాంగంలోని 73, 74 సవరణలు స్థానిక స్వపరిపాలనకు చట్టబద్ధమైన హోదా, అధికారాలు, బాధ్యతలు కల్పించాయి. అయితే రాష్ట్ర స్థాయిలో రాజకీయ–పరిపాలనా ప్రతిఘటనల వల్ల ఈ సవరణలు పూర్తిగా అమలుకావడం లేదు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం వికేంద్రీకరణ పాలనకు విరుద్ధం. దాదాపు కోటి ముప్పై లక్షల జనాభాను ఒకే మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చి, నిర్ణయాధికారాలను మరింత కేంద్రీకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇంత భారీ జనాభాకు ఒకే పరిపాలనా వ్యవస్థ ద్వారా సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన సాధ్యమా అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

దేశంలో వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యమని నిరూపించిన అనేక నమూనాలు ఉన్నాయి. అందులో కేరళ మోడల్ ముఖ్యమైనది. ఇటీవల కేరళ క్యాడర్‌కు చెందిన ఒక తెలుగు ఐఏఎస్ అధికారి కూడా, కేరళ అభివృద్ధికి ప్రధాన కారణం వికేంద్రీకరణ పాలనే అని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం మాత్రం 'సమగ్రాభివృద్ధి' పేరుతో ఈ విలీనాన్ని సమర్థించుకుంటోంది. ఇక్కడ కీలకమైన ప్రశ్న విలీనం చేయదలచుకున్న పట్టణ స్థానిక సంస్థల ప్రజల అభిప్రాయాలను తీసుకున్నారా? ఆయా మునిసిపాలిటీల సర్వసభ్య సమావేశాల్లో ఈ అంశంపై తీర్మానాలు జరిగాయా? శంకరపల్లి మున్సిపాలిటీలో చందిప్ప గ్రామ పంచాయతీ విలీనానికి వ్యతిరేకించి తమ స్థానిక పాలనను కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలోని వార్ధా పట్టణంలో ఒక గ్రామ పంచాయితీ, మునిసిపాలిటీలో విలీనాన్ని తిరస్కరించి స్వతంత్రంగా కొనసాగుతున్నది. మేము నిర్ణయాలు చేస్తాం మీరు అమలుపరచండి అనే ధోరణిని వ్యతిరేకిస్తూ చేసిందే 73, 74 రాజ్యాంగ సవరణ అని గుర్తించాలి.

ఈ సవరణల ప్రధాన రూపకర్త రాజీవ్‌గాంధీ సంకల్పానికి, ఆయన కలగన్న స్థానిక స్వపరిపాలన బలోపేత లక్ష్యానికి ఈ విలీన చర్య వ్యతిరేకం. పౌరుల అవసరాలు, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు బలమైన స్థానిక ప్రభుత్వాల ద్వారానే సాధ్యం. ప్రతి అంశాన్ని కేవలం ఆర్థిక కోణంలో మాత్రమే చూడలేం. రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన ముఖ్యమైన హక్కు పాలనలో భాగస్వామ్యం. ఎన్నికల సమయంలో ఓటు వేసే హక్కుతోనే పౌరులను పరిమితం చేసి, పాలనలో భాగస్వాములను చేయకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠం చేయడం ద్వారా కేరళ మానవవనరుల అభివృద్ధి సూచికల్లో అగ్రస్థానంలో నిలిచింది. అధిక అక్షరాస్యత, తక్కువ శిశు మరణాల రేట్లు, మెరుగైన ఆరోగ్య–విద్య సూచికలు మెరుగు పరచుకున్నారు. స్థానిక స్వపరిపాలన సంస్థలు ఆరోగ్యం, విద్య వంటి కీలక రంగాల్లో సేవలందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

అందుకే రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాలను స్థానిక ప్రభుత్వాలకు తిరిగి బదలాయించాలి. స్థానిక ప్రభుత్వాలను మెగా హైదరాబాద్‌లో విలీనం చేయడం కాదు, వాటిని బలోపేతం చేయడమే మన ముందున్న మార్గం. ప్రజాస్వామ్యం పట్ల, ప్రజల పట్ల పూర్తి విశ్వాసంతో, దృఢమైన రాజకీయ సంకల్పంతో కేరళ తరహా వికేంద్రీకరణ దిశగా తెలంగాణ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఆది నుంచి శ్రీశైలం నీళ్లను దూరం చేసే కుట్ర



పాలమూరుకు నీళ్లిచ్చిన కేసీఆరే గుర్తుంటరు! కృష్ణా నదిపై ప్రాజెక్టుల నిర్మాణానికి నిజాం కాలంలోనే ప్రతిపాదనలు చేశారు. అప్పటి హైదరాబాద్ రాజ్యంలో భాగమైన ప్రస్తుత కర్ణాటకలో ఉన్న యాద్గిర్ జిల్లాలోని తంగిడి వద్ద భీమా ప్రాజెక్టు, ఆలమట్టి వద్ద అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, తుంగభద్ర ఎడమకాలువ ద్వారా 174 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని నిజాం రాజు రూపకల్పన చేశారు. తుంగభద్ర నది నుంచి తెలంగాణకు 65, మద్రాసుకు 65 టీఎంసీలకు సాగునీళ్లు తీసుకునేందుకు హైదరాబాద్ సంస్థానం, మద్రాసు ప్రభుత్వం మధ్య 1944లో ఒప్పందం జరిగింది. ఈ తరుణంలో నిజాం చేతిలో ఉన్న హైదరాబాద్ స్టేట్ భారతదేశంలో విలీనం కావడంతో నిజాం హయాంలో చేసుకున్న ఒప్పందాలు రద్దయ్యాయి. కేంద్రంలోని అప్పటి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వమే దీనికి ప్రధాన కారణం.

నిందలతో ఏం కోల్పోయినమో ప్రజలకు తెలిసిన రోజు, మీ ద్రోహం తెలిసిన రోజు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, నేతలకు రాజకీయ ఉరి వేస్తారు. ఏదేమైనా దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ మాత్రమే. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో 50 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యమున్న రిజర్వాయర్లు, 12.30 లక్షల ఎకరాలకు సాగు నీటితో పాటు కల్వకుర్తి ప్రాజెక్ట్ కింద 2 లక్షల ఎకరాలు, భీమా, జూరాల, కోయిల్‌సాగర్ కింద మరో రెండు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఇది కాంగ్రెస్ నాయకులకు కనపడకపోవచ్చు. కానీ, గత పదేండ్లలో పాలమూరు ప్రాజెక్టుల కింద పండిన పంటలే దీనికి సాక్ష్యం. అప్పర్ కృష్ణా, భీమా ప్రాజెక్టులు పూర్తయి ఉంటే నేడు ఈ దుస్థితి ఉండేది కాదు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత కృష్ణా నదిపై తెలంగాణ కోసం ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదు. ప్రస్తుత శ్రీశైలం ప్రాజెక్టు 86 కిలోమీటర్ల ఎగువన సిద్దేశ్వరం వద్ద నిర్మించాల్సి ఉంది. కొల్లాపూర్ దగ్గర్లోని మంచాలకట్ట సమీపంలో ఉన్న సిద్దేశ్వరం వద్ద ఆ ప్రాజెక్టు నిర్మించి ఉంటే తెలంగాణకు గ్రావిటీ ద్వారా నీళ్లు అందేవి. నందికొండ వద్ద నిర్మించాల్సిన నాగార్జున సాగర్‌ను 24 కిలోమీటర్ల దిగువన నిర్మించారు. తద్వారా ప్రాజెక్టుల ముంపును తెలంగాణకు మిగిల్చి, సాగు నీళ్లను ఆంధ్రాకు తరలించారు అప్పటి వలస పాలకులు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రాంతానికి దక్కాల్సిన సాగునీటి హక్కుల కోసం ఆనాటి నాయకులు ట్రిబ్యునల్ ముందర సరిగ్గా వాదించలేకపోయారనేది ముమ్మాటికీ వాస్తవం. అప్పటికే సర్వే పూర్తి చేసుకున్న ప్రాజెక్టులను ట్రిబ్యునల్ ముందు ఉంచకపోగా, వాటి రద్దు కోసం అప్పటికే చేసుకున్న ఒప్పందాలను సైతం విలువలేని వాటిగా పరిగణించేటట్టు వ్యవహరించారు. తుంగభద్ర నది మీద కుడి, ఎడమ వైపులా గల కాలువల కోసం చెరో 65 టీఎంసీలు వాడుకోవాలని నిజాం హయాంలో ఒప్పందం జరిగింది. కానీ, ఆశ్చర్యకరంగా తుంగభద్ర కుడివైపు నీళ్లు కేటాయించుకొని 60 టీఎంసీలు వాడుకుంటూ, తుంగభద్రకు ఎడమ వైపున ఉన్న తెలంగాణకు కనీసం 6 టీఎంసీలు కూడా వాడుకోలేని పరిస్థితిని కల్పించారు. 1969లో బచావత్ ట్రిబ్యునల్ ఏర్పడింది. అయితే, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు మూలంగా తెలంగాణ నష్టపోయిన సాగునీటి వివరాలను అప్పటి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ట్రిబ్యునల్‌కు వెల్లడించలేదు. నాటి వలస ప్రభుత్వం వివరాలు వెల్లడించకపోయినా, సాగునీళ్లు అడగకపోయినా తీవ్రంగా నష్టపోయిన పాలమూరును చూసి 17.80 టీఎంసీలు కేటాయిస్తున్నట్టు బచావత్ ప్రకటించారు. సాగర్ ప్రాజెక్టును కిందికి తీసుకుపోయింది చాలదన్నట్టు, ఆ తర్వాత శ్రీశైలం ప్రాజెక్టును నిర్మించినప్పుడు జల విద్యుత్తు ప్రాజెక్టు పేరిట తెలంగాణ ప్రజలను నమ్మించారు. తర్వాతి కాలంలో మద్రాసు నగరం దాహార్తి తీర్చే సాకుతో ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక వాటాల నుంచి ఐదు టీఎంసీల చొప్పున 15 టీఎంసీలను పోతిరెడ్డిపాడు వద్ద పొక్క పెట్టి మద్రాసుకు తరలించారు. మంచినీటి తరలింపు పేరుతో కాలువలు తవ్వుతున్న క్రమంలో 'కడప, నెల్లూరు జిల్లాల ప్రజల కండ్లముందు నుంచి, ఇండ్ల ముందు నుంచి నీళ్లు వెళ్తున్నాయి. కరువుతో ఉన్నాం కాబట్టి, మా పంటల సాగుకు నీళ్లు ఇవ్వండని ప్రజలు అడుగుతున్నారు. కాబట్టి రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తాం' అని ప్రకటించారు. శ్రీశైలం ప్రాజెక్టు సాగునీళ్ల కోసం కాదని, విద్యుత్ అవసరాల కోసమేనని చెప్పి తెలంగాణ ప్రజలను ఏమార్చి మంచినీటి పేరుతో పోతిరెడ్డిపాడుకు పొక్కపెట్టి, తర్వాతి కాలంలో 11 వేల క్యూసెక్కులను 44 వేల క్యూసెక్కులకు పెంచి, అనంతరం దాన్ని మూడు పాయలు చేసి, కాలువ వెడల్పును 72 మీటర్లకు పెంచి ఏకంగా నదినే మలుపుకొనే విధంగా పోతిరెడ్డిపాడును తయారు చేసిన పాపం కాంగ్రెస్ పార్టీదే.

ఆది నుంచి శ్రీశైలం నీళ్లను తెలంగాణకు దూరం చేసే కుట్రలు కొనసాగుతున్నాయి. దానిలో అంతర్భాగమే నీళ్లు లేని జూరాల నుంచి 'నీళ్లు తీసుకొని వెళ్లండి' అని చెప్పడం. 'మొదట అక్కడే నది పారుతుంది. అక్కడే ఎక్కువ మోటర్లు పెట్టండి' అన్న వాదనను ప్రచారం చేశారు. దీంతో నీళ్లు కావాలనుకొని ఆలోచించే కొందరు నిజమైన తెలంగాణ మేధావులను కూడా 'జూరాల నుంచి నీళ్లు తీసుకుంటే బాగుంటుండె కదా' అని మాట్లాడే పరిస్థితికి తీసుకువచ్చారు. ఒకవేళ జూరాల నుంచి గనుక పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీళ్లు ఎత్తిపోయాలనుకుంటే తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. జూరాలలో 20 నుంచి 25 రోజులు మాత్రమే సగటున భారీ వరద వస్తుంది. ఆ తర్వాత వచ్చే నీళ్లు కనీసం మోటర్లకు సరిపోవు. భీమా ఫేజ్1, ఫేజ్2 కింద రెండు లక్షల ఎకరాలు, నెట్టెంపాడు కింద 2 లక్షల ఎకరాలు, కోయిల్ సాగర్ కింద 46 వేల ఎకరాలు, జూరాల కుడి, ఎడమ కాలువలు కలిపి లక్ష 10 వేల ఎకరాలు.. ఇవన్నీ కలిపి దాదాపు 6 లక్షల ఎకరాలు జూరాల మీద ఆధారపడ్డయి. వీటికే సాగునీరు అందక క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నారు. జూరాల మీద ఆధారపడ్డ భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల పంపులు 40 నుంచి 45 రోజులకు మించి నడవడం లేదు. ఆ పంపుల సామర్థ్యం కూడా 16 నుంచి 20 మెగావాట్లు మాత్రమే. 1620 మెగావాట్ల సామర్థ్యమున్న పంపులే 40 నుంచి 45 రోజులు మాత్రమే నడిస్తే.. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 145 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 10 పంపులకు సరిపడా నీళ్లు అందించగలిగే కెపాసిటీ జూరాలకు ఉందా? శ్రీశైలం బ్యాక్ వాటర్ మీద ఆధారపడి ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులు సగటున ఏడాదికి 230 నుంచి 240 రోజులు నడుస్తున్నాయి. జూరాల మీద ఆధారపడిన భీమా, నెట్టెంపాడు పంపులు కేవలం 40 నుంచి 45 రోజులే నడుస్తున్నాయి. మరి దీని ప్రకారం పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతలకు సాగునీళ్లు ఎక్కడి నుంచి తీసుకోవాలి? ఈ నేపథ్యంలో 'పాలమూరురంగారెడ్డికి జూరాల నుంచి నీళ్లు తీసుకోవాలి. శ్రీశైలం నుంచి వద్దు' అనే చెప్పేవాళ్లు ఎవరైనా తెలంగాణ, పాలమూరు ద్రోహులే. జూరాల నుంచి పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల చేపట్టి కోయిల్ కొండ దగ్గర, కొండాపురం వద్ద రెండు రిజర్వాయర్లను నిర్మిస్తామని కాంగ్రెస్ చెప్పింది. కోయిల్ కొండ వద్ద వెయ్యి ఎకరాలు, కొండాపురం వద్ద 500 ఎకరాల అటవీ భూమి ఉంది. కేంద్ర ప్రభుత్వం వీటికి కచ్చితంగా అటవీ అనుమతులు ఇవ్వదు. జూరాల నుంచి పాలమూరు ఎత్తిపోతల చేపడితే 2013 లెక్కల ప్రకారం 46 గ్రామాలు ముంపునకు గురికావడమే కాకుండా 85 వేల మంది ప్రజలు ప్రభావితమవుతారు. 77 వేల ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంటుంది. తాజా లెక్కల ప్రకారం మూడు లక్షల మంది ప్రభావితమవుతారు. ఇంతా చేసి నిర్మిస్తే జూరాల నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి ఉండదు. అంటే అది పూర్తిగా నిరర్థక ప్రాజెక్టుగా నిలిచిపోతుంది.

శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్మాణాల మూలంగా తెలంగాణ మునిగి ఆంధ్రాకు ప్రయోజనం చేకూరింది. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణలో కనీసం భూగర్భజలాలైనా పెరిగే అవకాశం లేకపోయింది. ఎందుకంటే అవి పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉన్నాయి. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్మించిన రిజర్వాయర్లలో 68 టీఎంసీల నీళ్లను నింపుకోవడం ద్వారా భౌగోళికంగా కొన్ని మైళ్ల దూరం భూగర్భజలాలు విస్తరించి మరో 10 నుంచి 12 లక్షల ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉంటుంది. పదేండ్ల కేసీఆర్ శ్రమ ఫలితంగానే పాలమూరు పచ్చబడింది. పాలమూరు ప్రాజెక్టుతోనే ఈ ప్రాంత ముఖచిత్రం మారుతుంది. పాలమూరు పచ్చబడితే తమ ప్రాంతానికి నష్టమని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం దానికి అడ్డం పడుతున్నది. అందుకు తెలంగాణలోని ఆంధ్రా బానిసలు వంతపాడుతున్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ ఖర్చులు నేటి లెక్కల ప్రకారం రూ.80 వేల కోట్లుగా అంచనా వేసి, బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులు రూ.27 వేల కోట్లు మాత్రమే అని అవివేకంగా ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.32 వేల కోట్ల పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టులో కీలకమైన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు, విద్యుత్ స్టేషన్లు నిర్మించిన తర్వాత కాలువలకు టెండర్లు పిలిచాక కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. గద్దెనెక్కిన వెంటనే కాంగ్రెస్ సర్కార్ కాలువల టెండర్లను రద్దుచేసింది.

తెలంగాణలో ప్రజలకు నీళ్లు, టీఎంసీలు, క్యూసెక్కులు, ప్రాజెక్టులు, సాగునీటి విలువ, అది మార్చే ప్రజలు, ప్రాంతాల ముఖచిత్రాల గురించి తెలియజెప్పింది కేసీఆరే. 'మనం ఎత్తున ఉన్నాం. మన ప్రాంతానికి నీళ్లు ఎలా వస్తాయి?' అని ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు మాట్లాడిన పరిస్థితి ఉండేది. ఆరు దశాబ్దాల పాలనలో ఏ ఒక్క కాంగ్రెస్ నేత పాలమూరు కోల్పోయిన సాగునీళ్ల గురించి ప్రజలకు తెలియజెప్పలేదు. ఒక్క జూరాల ప్రాజెక్టును ముందుపెట్టి దానినే 40 ఏండ్ల కాలంలో సాధించిన అతిగొప్ప ఘనకార్యంగా చాటుకున్నారు. కర్ణాటకకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని దానిని కూడా ఎన్నడూ నిండా నింపలేదు. చివరకు కేసీఆర్ నిలదీసిన తర్వాతనే పరిహారం చెల్లించారు. నాటి నుంచి నేటి వరకు శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో తెలంగాణ వాళ్లు వేలు పెట్టకూడదనే ప్రయత్నాలే సాగుతున్నాయి. శ్రీశైలానికి అదనంగా తుంగభద్ర నుంచి 450 టీఎంసీల నీళ్లు వస్తాయి. జూరాల నుంచి నీళ్లు తీసుకోవాలని వాదించడమంటే పాలమూరుకు ద్రోహం చేయడమే. నిందలతో ఏం కోల్పోయినమో ప్రజలకు తెలిసిన రోజు, మీ ద్రోహం తెలిసిన రోజు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, నేతలకు రాజకీయ ఉరి వేస్తారు. ఏదేమైనా దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ మాత్రమే. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో 50 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యమున్న రిజర్వాయర్లు, 12.30 లక్షల ఎకరాలకు సాగు నీటితో పాటు కల్వకుర్తి ప్రాజెక్ట్ కింద 2 లక్షల ఎకరాలు, భీమా, జూరాల, కోయిల్‌సాగర్ కింద మరో రెండు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఇది ప్రస్తుత కాంగ్రెస్ నాయకులకు కనపడకపోవచ్చు. కానీ, గత పదేండ్లలో పాలమూరు ప్రాజెక్టుల కింద పండిన పంటల గణాంకాలే దీనికి సాక్ష్యం. అందుకే ఏ నాటికైనా ప్రజలకు కనిపించేది సాగు నీళ్లు తెచ్చిన కేసీఆర్ మాత్రమే.

# ఇరాన్‌కు ట్రంప్ గండం!



తన దేశం ప్రజాస్వామ్యం వైపు ప్రయాణిస్తోందని ఇరాన్ చిట్టచివరి షా పెద్దకుమారుడు మహ్మద్ రెజా పహ్లావి అంటున్నారు. మతపెద్దల పాలనలో యాభైయేళ్ళుగా విసిగివేసారిన ఇరానియన్లు తమ ఉజ్వల భవిష్యత్తుకోసం, భావితరాల అభ్యున్నతికోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాటాలు చేస్తున్నారని పహ్లావి ప్రశంసించారు. ఒక హంతకుడినో, రేపిస్టునో సంకెళ్ళు వేసి జైలుకు తరలించినట్టుగా ఒకదేశాధ్యక్షుడిని సైనిక హెలికాప్టర్‌లో అమెరికా తరలించుకుపోయిన డోనాల్డ్‌ట్రంప్ అదేరీతిలో ఇరాన్‌లోనూ చొరబడి, అక్కడి పాలకులను కూల్చి తనను ప్రతిష్ఠిస్తారని పహ్లావీకి ఆశలు చిగురించి వుంటాయి. మదురోను అమెరికా ముట్టడించిన తీరు చూసిన వారికి తరువాత దెబ్బ ఇరాన్‌కు తగలక తప్పదనిపించడం సహజం. సామాన్యులే కాదు, మహామహా మేధావులు సైతం ట్రంప్ త్వరలోనే ఇరాన్ పాలకులను మట్టుబెట్టి, ఇజ్రాయెల్ ముచ్చట తీర్చడం ఖాయమని అంటున్నారు. మాదకద్రవ్యాల ఉగ్రవాది అన్న ఆరోపణమీద మదురోను సునాయాసంగా ఎత్తుకుపోయి అమెరికా బోనులో నిలబెట్టిన ట్రంప్, ఇజ్రాయెల్ పక్షాన ఇరాన్‌తో యుద్ధం చేసి, శత్రువులను హతమారుస్తాడని నమ్ముతున్నారు. ట్రంప్ దూకుడుని ఎన్నో దేశాలు ఖండించినా, అంతకుమించి ఎవరూ ఏమీ చేయని, చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు, ఇటువంటి నమ్మకాలు కలగడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఇరాన్‌లో కరెన్సీ విలువపడిపోయినందుకు దుకాణదారులు ఆగ్రహంతో రోడ్డుమీదకు వస్తే, పదిరోజుల్లోనే అది మహోధృత ప్రజాఉద్యమంగా రూపాంతరం చెందడం వెనుక అమెరికా ప్రోద్బలమూ, ఆశీస్సులు ఉన్నాయని అంటారు. గతంలో ఇలాంటి అందోళనలు రేగినా, ఇరాన్ పాలకులు వాటిని సునాయాసంగా అణచివేశారు. కానీ, ఇప్పుడు దేశంలో సగానికిపైగా ప్రావిన్సులకు విస్తరించిన నిరసనలు ఇటీవలికాలంలో చూడనివని, నియంత్రించడం కష్టమని వార్తలు వస్తున్నాయి. మదురోను అమెరికా ముట్టడించిన ఘట్టం ఇరానియన్లలో ఉత్సాహాన్ని పెంచిందని, తమను ఎవరూ ఏమీ చేయలేరన్న నమ్మకాన్ని పెంచిందని, మరోపక్క, నిరసనలను కఠినంగా అణచివేసే విషయంలో ఇరాన్ పాలకులు వెనక్కుతగ్గుతున్నారని మీడియా అంటోంది. నిరసనకారులమీద బలప్రయోగం వద్దు అన్న ఇరాన్ అధ్యక్షుడి ఆదేశాల వెనుక, వారి జోలికి వస్తే ఊరుకొనేది లేదని, బరిలోకి దిగుతానని ట్రంప్ చేసిన హెచ్చరిక పనిచేసిందని కొందరి నమ్మకం. వందలాది అరెస్టులు జరిగిపోయి, ముప్పైఐదుమంది ప్రాణాలు పోయిన నేపథ్యంలో, అధ్యక్షుడు మసూద్ పెజష్కియాన్ శాంతియుతంగా నిరసిస్తున్నవారి జోలికిపోకండని తన బలగాలకు ఓ మాట చెప్పడం కూడా ఇప్పుడు ట్రంప్ ఖాతాలోకే పోతోంది. మందుగుండు దట్టించి, లాక్ బిగించానంటున్న ట్రంప్.. మదురో తరహాలో ఇరాన్ పెద్దలతో వ్యవహరించలేరన్నది వాస్తవం. తొలివిడత ఏలుబడిలోనే ఆయన వెనెజువెలాలోకి చొరబడాలని నిర్ణయించుకొని మలి రాకడలో ఆ పనిచేశాడని, ఈ కొత్త సంవత్సరం తొలిరోజున ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూ పక్కన ఉండగా 'ఇరాన్.. నెక్ట్స్ నువ్వే' అని హెచ్చరికలు చేశారు కనుక, త్వరలోనే చొరబాటు ఖాయమని అంతా విశ్లేషిస్తున్నారు. కానీ, లాటిన్ అమెరికా, పశ్చిమాసియా మధ్య హస్తిమశకాంతరం ఉన్నదని ట్రంప్‌కు తెలియనిది కాదు. అణ్వస్త్రాలు లేకపోవచ్చు కానీ, క్షిపణి సంపత్తి దండిగా ఉన్న ఇరాన్ గట్టిగానే జవాబు చెబుతుంది. రష్యా, చైనాలు సైతం రంగంలోకి దిగే ప్రమాదమూ ఉంది. ఇరాన్‌లో నిరసనలు కొత్తకాదు. గత పాతికేళ్ళలోనే వందలాది నిరసనలు జరిగాయి, అనేకం వాటంతటవే ఆగిపోయాయి, కొన్నింటిని పాలకులు తమ నిర్ణయాలను సరిదిద్దుకోవడం ద్వారా చల్లారిపోయేట్టు చేశారు. ప్రధానంగా చమురు ఎగుమతులు బాగా తగ్గి ఆర్థికంగా ఇప్పుడు మరింత కఠినమైన పరిస్థితులను ఇరాన్ ఎదుర్కొంటున్నది. కరెన్సీ విలువ సగానికి పడిపోవడం, కొనుగోలు శక్తినశించడం ప్రజాగ్రహానికి కారణమవుతున్నాయి. గత ఏడాది జూన్‌లో ఇరాన్‌మీదకు కాలుదువ్విన ఇజ్రాయెల్ పక్షాన అమెరికా రంగప్రవేశంచేసి మూడు అణుకేంద్రాలను ధ్వంసం చేసింది. పన్నెండురోజుల ఆ యుద్ధంలో పైచేయి ఎవరిదన్న ప్రశ్న అటుంచితే, ఈ కొత్త సంవత్సరంలో ఇరాన్ జోలికి అమెరికా పోయిన పక్షంలో అది సరిహద్దులకే పరిమితం కాబోదనీ, ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తుందన్నదీ వాస్తవం.

# పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం..

**మరోసారి దాతృత్వాన్ని చాటుకున్న కేసీఆర్**



**అక్షర గళం, ఎర్రవెల్లి :** విద్యుత్ ప్రమాదంలో ఇటీవల మరణించిన ఎర్రవెల్లి గ్రామ నివాసి పేద రైతు చిన్నాజు సత్తయ్య కుమారుడు, స్థానిక ఇంజనీరింగ్ కాలేజీలో బి టెక్ చదువుతున్న నవీన్, అదే గ్రామానికి చెందిన, ప్రమాద వశాత్తూ కొన్ని సంవత్సరాల క్రితం మరణించిన,మరో పేద రైతు పెద్దోళ్ల సాయిలు కొడుకు, బి టెక్ చదువుతున్న అజయ్., లను చేరదీసి వారి ఇంజనీరింగ్ చదువు పూర్తికాలపు ఫీజులను బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ చెల్లించారు. వారికి అవసరమయ్యే పుస్తకాలు, కంప్యూటర్ల కోసం కూడా ఆర్థిక సాయం అందించారు.ఈ మేరకు వారికి విడి విడి గా చెక్కులు అందించారు ."కష్టపడి మంచిగ చదువుకోండి బిడ్డా.. మీరు కష్టపడి గొప్ప స్థాయిని చేరుకోవాలె. మీరు.. ఫీజులకోసం భయపడొద్దు. యే సమస్య వచ్చినా నేనున్న.." అంటూ భరోసా నిస్తూ కేసీఆర్ ఆశీర్వదించారు. విద్యుత్ ప్రమాదంలో మరణించిన చిన్నాజు సత్తయ్య కుటుంబానికి సంబంధిత విద్యుత్ శాఖ నుంచి చట్టపరంగా అందే ఆర్థిక తదితర సాయం గురించి పర్యవేక్షించి వారికి న్యాయం జరిగేలా చూడాలని తన వ్యక్తిగత కార్యదర్శి నాగేందర్ రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు.. కుటుంబ పెద్దను కోల్పోయిన తమను గుర్తించి, ఆదరించి, ఆర్థికంగా ఆదుకుని, తమ పిల్లల చదువు, భవిష్యత్తు గురించి ఆలోచన చేసిన కేసీఆర్ గారికి, పిల్లల తల్లులు చేతులెత్తి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. తమ చదువుకోసం భరోసాగా నిలిచిన కేసీఆర్ కి ఎర్రవెల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# సిపిఐ వందేళ్ల ప్రస్థానంపై ఖమ్మంలో సభలు

(మొదటిపేజీ తరువాత)

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌కు వెళ్లారు. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..సీపీఐ ఆవిర్భావం నుంచి పోరాటాల పంథా కొనసాగించిందని తెలిపారు. పేదలు, కార్మికుల హక్కుల కోసం ఎంతోమంది జైలుకు వెళ్లారని అన్నారు. దేశం కోసం సీపీఐ ఎన్నో త్యాగాలు చేసిందని ప్రస్తావించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పోరాటాల గడ్డ ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఖమ్మంలో జాతీయ కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. 20వ తేదీ వామపక్ష పార్టీల జాతీయ నాయకులు ఆహ్వానించి సెమినార్ ఏర్పాటు చేశామని అన్నారు. 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే ఈ సెమినార్‌కు ఎనలేని ప్రాధాన్యత ఉందని వివరించారు. ఈ సెమినార్‌లో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని వెల్లడిరచారు. వామపక్ష పార్టీలు దేశంలో ఇతర పార్టీలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు రామకృష్ణ. ప్రపంచాన్ని బెదిరించాలనేదుస్సాహసానికి ట్రంప్ పాల్పడ్డారని ,ఇంత జరుగుతున్నా.. ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను




సంతృప్తిపరచాల్సిన బాధ్యత మోదీపై ఉందని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల అన్నారని ప్రస్తావించారు. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు నాయకత్వం ఇచ్చిన ఇండియా.. ఇప్పుడు మాట్లాడలేని పరిస్థితికి ఎందుకు దిగజారిందని నిలదీశారు. మోదీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశానికి విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ పిచ్చోడి చేతిలో రాయిలాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక దేశ అధ్యక్షుడి ఇంటిపై దాడి చేసి కిడ్నాప్ చేసే నీచ స్థితికి ట్రంప్ దిగజారారని షాకింగ్ కామెంట్స్ చేశారు. పోలవరం ముంపు ప్రాంతాల మండలాల్లో ఈరోజు(గురువారం) సమావేశం ఉందని రామకృష్ణ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి 2027 మార్చి నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అందిస్తామని అంటున్నారని అన్నారు. పోలవరం పూర్తిచేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పోలవరం ఏర్పాటుకు త్యాగాలు చేసిన భూ నిర్వాసితుల పరిస్థితి గురించి మాట్లాడటం లేదని అన్నారు. ఆగస్టు నెల వస్తే ఆ మండలాల్లోనే గ్రామాలు మునిగిపోతున్నాయని చెప్పుకొచ్చారు. 135 అడుగుల వరకు మాత్రమే సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ముంపు బాధితులను గాలికి వదిలేశారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని అన్నారు. మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆపరేషన్ కగార్‌ను సీపీఐ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. తక్షణమే నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ కూడా బూటకమేనని, పట్టుకొచ్చి కాల్చి చంపారని ఆరోపణలు చేశారు. ప్రశ్నించే వాళ్లని అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని రామకృష్ణ విమర్శించారు.



# మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**- సర్పంచ్ మహేందర్ గౌడ్**
**- చరికొండలో డ్వాక్రా భవనానికి శంకుస్థాపన**

**ఆమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):** మహిళల సంక్షేమం కోసం పెద్దపీట వేసి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్ తెలిపారు. గురువారం కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ల సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి రూ. 10 లక్షలతో నూతన డ్వాక్రా భవన నిర్మాణానికి సర్పంచ్ మహేందర్ గౌడ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యతతో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల పేరు మీద ఇందిరమ్మ పక్కా గృహం నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు భయపడకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా క్షేమం చేపడుతూనే ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని అన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అద్దాల రాములు, ఉప సర్పంచ్ బలవంత్ రెడ్డి, స్థల ధాత ఎండి అక్బర్, మరియు గ్రామ సెక్రెటరీ, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.



# గిరిజన యువత క్రీడల్లో రాణించాలి

**- నుచ్చుగుట్ట తాండ ప్రీమియర్ లీగ్–3 ను ప్రారంభించిన అఖిలపక్ష నాయకులు**

**ఆమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):** గిరిజన యువత క్రీడారంగంలో రాణించాలని అఖిలపక్ష నాయకులు ఆకాంక్షించారు. క్రీడల వలన మానసిక, శారీరక వికాసంతో పాటు, క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ 3వ వార్డు పరిధిలోని నుచ్చుగుట్ట, సాకిబండ, ఎర్రబీక్య తాండ నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ 3 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆల్ పార్టీ అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గిరిజన యువత తప్పుడు మార్గంలోకి వెళ్లకుండా ఉద్యోగ, ఉపాధి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత జీవితాలలో క్రీడలు భాగం కావాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని వాటిని అధిగమించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్య నాయక్, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, కల్వకుర్తి అసెంబ్లీ గిరిజన మోర్చా లీడర్ నరేందర్ రాథోడ్, బీ ఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ మోర్చా అధ్యక్షుడు రమేష్‌నాయక్, పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ లీడర్ గన్య నాయక్, కిరణ్ బావోజీ, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు సంతోష్ నాయక్, రాధాకిషన్, సభావత్ గణేష్, రఘు, శంకర్ మైసిగండి, సభావత్ హరి, నేనావత్ శివ, సభావత్ వెంకటేష్, భాస్కర్, నేనావత్ సంతోష్, రవి, రమేష్, రాజు, శివరాం, లాలు, ఈశ్వర్, హనుమంత్, సందీప్, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీపీ కార్యాలయాన్ని మహేశ్వరంకు మార్చాలి



**ఆమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):** ఆమనగల్లు ఏసీపీ కార్యాలయాన్ని మహేశ్వరం డీసీపీ పరిధిలోకి మార్చాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. గురువారం ఆయన 'సూపర్ సిటీ' పోలీస్ కమిషనర్ సుధీర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కడ్తాల్ పోలీస్ స్టేషను ఆమనగల్లు ఏసీపీ పరిధిలోకి తీసుకురావాలని విన్నవించారు. ఈ మేరకు సీపీకి వినతిపత్రం అందజేస్తూ, పరిపాలన సౌలభ్యం కోసం ఈ మార్పులు చేయాలని కోరారు.



# క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి

**- డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్**
**- మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్**



**ఆమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):** క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. గురువారం కడ్తాల్ మండల పరిధిలోని వాసుదేవపూర్ గ్రామంలో ప్రీమియర్ లీగ్ 6 క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ రమేష్ తో కలిసి వారు వేరువేరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. యువత చెడు మార్గంలో వెళ్లకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడా పోటీలతో యువతకు శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం పెరుగుతాయని అన్నారు. ఆటల పోటీలలో గెలుపు ఓటమిలు సహజమని ఓడిన వారు నిరాశ చెందకుండా గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, మాజీ సర్పంచ్ నరేందర్, రాములు, సుమన్ నాయక్, రామకృష్ణ, వార్డు సభ్యులు ఘసిరామ్, రవి, రాజేందర్, లక్ష్మణ్, విఠల్, సుమన్, గోపాల్, జైపాల్, రవి, కృష్ణ, వినోద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**- మాజీ ఎంపీటీసీ కుమార్**
**- ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ**



**ఆమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని మాజీ ఎంపీటీసీ, మండల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దోనాదుల కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ కుమార్ మాట్లాడుతూ.. జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. విద్యార్థులు సేంద్రియ సాగు వంటి సమాజ ప్రయోజకర అంశాలపై తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేలా చదువుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంతుక వెంకటయ్య, మాజీ సర్పంచ్ మరియు టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మల సత్యం యాదవ్, మాజీ సర్పంచ్ సుక్కమ్మ లాలయ్య, విద్యా కమిటీ చైర్మన్ యాదమ్మ, ప్రధానోపాధ్యాయులు సుభాష్, వార్డు మెంబర్ ధోనాధుల రామకృష్ణ, కృష్ణ యాదవ్, నాయకులు భీమయ్య, ఒగ్గు లాలయ్య, తిరుపతయ్య గౌడ్, రాగి చంద్రయ్య, వరికుప్పల పర్వతాలు, జంతుక నాగయ్య, ధోనాధుల చంద్రమౌళి, ఒగ్గు వెంకటయ్య, తుమ్మల యాదగిరి, శ్రీను యాదవ్, ధోనాధుల నరేష్, ఆమనగంటి సాయిబాబు, ఈర్లపల్లి శేఖర్, సిరిగని వెంకటయ్య, కృష్ణ యాదవ్, భాస్కర్, అరుణ్, రామకృష్ణ, సిరిగని శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**- పాపిశెట్టి రాము**

**అమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. గురువారం వెల్దండ మండలంలోని నారాయణపూర్ తండాలో ఎన్.పీ.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాపిశెట్టి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు.

# గాజుల సర్వేశ మృతి పట్ల నేతల సంతాపం



**అమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):** ఆమనగల్లు పట్టణానికి చెందిన గాజుల సర్వేశ గురువారం ఉదయం తీవ్ర అస్వతగ్గురై అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ జెడ్పిటిసి సభ్యులు కండే హరిప్రసాద్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, వివిధ పార్టీల నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు వెంకటేశ్వర కాలనీలోని ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించి ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంత నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్నారు.



# సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**- ఉప్పల వెంకటేష్**

**ఆమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):** సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామంలోని సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. గురువారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికీ చెందిన వార్డు సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువతో సత్కరించి మాట్లాడుతూ.. సర్పంచులు గ్రామానికి ప్రథమ పౌరుడని అన్నారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారి ఐదేళ్ల పదవీ కాలంలో మంచి పనులు చేసి చిరస్థాయిగా గ్రామంలో పేరు నిలిచిపోయేలా చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కువ శాతం బీదలు గ్రామాలలోనే ఉన్నారని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయకుండా మంచి పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కడారి రాజు, సురిగిమల్లా శేఖర్, కంబాలపల్లి రవి, మందగాళ్ల చెన్నకేశవులు, పురుగుల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో వ్యవస్థను అమలులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**అక్షర గళం, హైదరాబాద్ :** రైతు చేతికందిన ధాన్యాం నష్ట పోకుండా ఉండేందుకు గాను ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో వ్యవస్థను అమలులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో భారత ఆహార సంస్థ,రాష్ట్ర పౌర సరఫరాల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతికొచ్చిన పంట భద్రతకోసం ఆధునిక పరిజ్ఞానంతో నిలువ చేసేందుకు రూట్ మ్యాప్ రూపొందిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.తద్వారా రైతుకు భరోసా కల్పించడంతో పాటు ఆహార భద్రతను పెంపొందించడం సులభ తరమౌతుందని ఆయన పేర్కొన్నారు. యావత్ భారత దేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణా రాష్ట్రం అగ్రగామిగా నిలుచుండడంతో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని పరిరక్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. సైలో పద్దతిలో బియ్యం ,మొక్క జొన్న, సోయాబీన్ వంటి పంటలను కుడా నిల్వ చేసుకునే ఆస్కారం ఉంటుందని ఆయన తెలిపారు. మనుషుల జోక్యం లేకుండానే సైలో పద్దతిలో ఉండే ఇంటిగ్రేటెడ్ క్లినర్లు,డ్రైయర్లతో రెండు సంవత్సరాల వరకు ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు అవకాశం ఉంటుందన్నారు.ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకు పంపడంతో మిల్లింగ్ లో జరుగుతున్న జాప్యంతో ధాన్యం చేడి పోయి నష్టం వాటిల్లుతుందని ,మిల్లులలో శాస్త్రీయ పద్దతిలో నిల్వ చేసే అవకాశం లేక పోవడంతోటే ఈ నష్టం వతిలుతుందని ఆయన చెప్పారు.అటువంటి పరిస్థితిలలో రైతాంగానికి భరోసా ఇవ్వడంతో పాటు ధాన్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం శాస్త్రీయమైన సైలో పద్దతిని అమలులోకి తేవాలి అనే ఆలోచనకు శ్రీకారం చుట్టమన్నారు. తద్వారా ధాన్యం కొనుగోలు సమయంలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో పద్దతిలో ఉండే డ్రైయర్ల ద్వారా తేమను తొలగించడంతో పాటు దాన్యన్ని దీర్ఘ కలికాంగ పరిరక్షించు కోవచ్చని ఆయన తెలిపారు. అంతే గాకుండా పాత బియ్యానికి మార్కెట్ లో అధిక ధర లభిస్తుందన్నారు.ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పుల ప్రభావం దేశ వ్యాప్తంగా చూపుతుందన్నారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన పేదలకు ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ,సన్నాలకు 500 బోనస్ వంటి సంస్కరణలతో దేశవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిందన్నారు. ఆ క్రమంలోనే చేతికొచ్చిన పంట పాడవకుండా ఉండెందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తేవలనుకుంటున్న సైలో ప్రాజెక్టుతో పెద్ద ఎత్తున ప్రయోజనం ఉండే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రధానంగా కేంద్రప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం మీదకు నెట్టేసి మిల్లింగ్ అయిన బియ్యాన్ని కేంద్రం కొనుగోలు చేయడంతో కొనుగోలుకు మిల్లింగ్ కు మద్యన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 5,000 కోట్లు నష్ట పోతుందని... సైలో పద్ధతిని అమలులోకి తెస్తే 5,000 కోట్ల భారాన్ని అధిగమించడంతో పాటు 1,000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పద్ధతిని అమలులోకి తేవాలని యోచిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



## కీసర దొడ్ల పాల వ్యాపారి పై తల్వార్ తో దాడి

**కీసర, జనవరి 08 (అక్షర గళం) :**

దొడ్ల డైరీ పాల్ స్టేట్ ఇంచార్జ్‌పై బ్రాంచ్ ఇంచార్జ్ తల్వార్‌తో దాడి చేసిన ఘటన కీసరలో కలకలం రేపింది. ఈ ఘటనలో దొడ్ల డైరీ స్టేట్ ఇంచార్జ్ కొండపాక శ్రీనివాస్ (50) తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... కీసర గ్రామంలోని దొడ్ల పాల్ బ్రాంచ్ ఇంచార్జ్ కిరణ్ అలియాస్ పవన్ కళ్యాణ్ సకాలంలో కంపెనీకి చెల్లించవలసిన డబ్బులు చెల్లించకపోవడంతో, దొడ్ల డైరీ యాజమాన్యం ఫ్రాంచైజీని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది.ఈ నేపథ్యంలో గురువారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో స్టేట్ ఇంచార్జ్ కొండపాక శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి కీసరలోని దొడ్ల పాల్ బ్రాంచ్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో కిరణ్ అలియాస్ పవన్ కళ్యాణ్ వారితో వాగ్వాదానికి దిగుతూ, ముందుగా తన వాహనంలో తెచ్చుకున్న తల్వార్‌ను తీసుకుని విచక్షణారహితంగా శ్రీనివాస్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను వెంటనే చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కీసర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడు కిరణ్ అలియాస్ పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్



**కల్వకుర్తి జనవరి 8 (అక్షర గళం):** కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండల పరిధి లోని మాదాయ పల్లి గ్రామానికి చెందిన ఆయిల్ అంజయ్య గౌడ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు విషయాన్ని సర్పంచ్ గూళ్ళ సుధాకర్ ద్వారా తెలుసుకొని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తూ మూడువేల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. గ్రామ సర్పంచ్ గూళ్ళ సుధాకర్, మాజీ సర్పంచ్ రామస్వామి ఆయిల్ నరేందర్ గౌడ్ అంజయ్య ఇస్తారి పరంజ్యోతి ఆనంద్ రామస్వామి మాధవులు ఆంజనేయులు భగవంతు రవి గ్రామ పెద్దలు నాయకులు తదితరులు ఉన్నారు.



## రైతులకు న్యాయం జరిగే వరకు మా మద్దతు ఉంటుంది

**మద్దతు తెలిపిన బిజేపి, కాంగ్రెస్,మాలమహానాడు నేతలు**
**రెండవ రోజు దీక్ష లో పాల్గొన్న రైతులు...**

**కీసర, జనవరి 08(అక్షర గళం) :** వ్యవసాయం చేసుకుంటున్న పొలాలను హెచ్ హెమ్ డబ్ల్యు ఎస్ వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ రెండవ రోజు గురువారం వ్యవసాయ పొలం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి , బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు గండి అంజయ్య గౌడ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పంబల్ల రమేష్ , మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం లు పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కొన్ని ఏండ్లుగా వ్యవసాయం చేసుకుంటు బ్రతుకుతున్నారు.రైతులకు న్యాయం జరిగే వరకు తమ వంతు మద్దతు ఉంటుందనీ అన్నారు.





## రోడ్డు భద్రతపై సిబిఎం కళాశాల విద్యార్థులకు అవగాహన

**విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించిన ఎస్ఐ మాధవరెడ్డి**

**కల్వకుర్తి జనవరి 8 (అక్షర గళం):** జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను కల్వకుర్తి పట్టణ సమీపం లోని సిబిఎం కళాశాలలో గురువారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు ఈ సందర్భంగా విద్యార్థులచే రోడ్డు భద్రత పై ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎం.వి.ఐ అశోక్ పోలీస్ సిబ్బంది 900 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు.



## గోదావరి ఫేజ్ 2&3 ప్రాజెక్ట్ 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి

**నీటి శుద్ధి కేంద్రాలు,పైప్ లైన్ నిర్మాణంపై ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష**




**అక్షర గళం, హైదరాబాద్ :**

గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2&3 ప్రాజెక్ట్ పనులను డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డీ అధికారులను ఆదేశించారు హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల అదనపు నీటిని తరలించడానికి, మూసీ పునరుజ్జీవనంకోసం జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి రూ. 7,360 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు జలమండలి చేపట్టింది. ఈ పనులపై గురువారం ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... మల్లన్న సాగర్ నుంచి ఘన్ పూర్ వరకు.. అక్కడి నుంచి ఉస్మాన్ సాగర్ వరకు నిర్మించాల్సిన పైప్ లైన్ విస్తరణ పనులు, ఘన్ పూర్ వద్ద నిర్మించనున్న 80 మిలియన్ లీటర్ల మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఘన్ పూర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ల వద్ద నిర్మించే నీటి శుద్ధి కేద్రాల పనులలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఏకకాలంలో నీటి శుద్ధి కేద్రాల నిర్మాణ పనులను, పైప్ లైన్ విస్తరణ పనులు, తదితర పనులను జరపాలన్నారు. గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్ 1 కింద.. నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తోంది. తాజాగా పథకంలో రెండు దశల ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 20 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 20 టీఎంసీల్లో.. 17.5 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా, మూసీ ప్రక్షాళనలో భాగంగా.. జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 2.5 టీఎంసీలను ఉపయోగించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రెండు లాభాలున్నాయి. ఒకటి హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చడం, రెండోది.. మూసీ ప్రక్షాళన, జంట జలాశయాల పునరుజ్జీవం చెయ్యడం.ఈ ప్రాజెక్టులో పంప్ హౌజ్ లు, సబ్ స్టేషన్లు, మల్లన్న సాగర్ నుంచి ఘన్ పూర్ వరకు 3000 ఎంఎం డయా భారీ పైపు లైన్ నిర్మించనున్నారు. అంతే కాకుండా ఘన్ పూర్, శామీర్ పేట్ వద్ద 1170 ఎంఎల్డీల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని (డబ్ల్యూటీపీ) నిర్మించనున్నారు. ఘన్ పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు.. ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్ 2&3 ద్వారా 300 ఎంజీడీల నీరు సరఫరా చేస్తారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎమ్ మహేష్ కుమార్ లతో పాటు, సంబంచిన అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.




## యువ శక్తి దేశానికి ఆస్థి

**-జాతీయ విద్య భారతి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మురళి మనోహర్**
**-జర్నలిజం విలువల పై అవగాహన సదస్సు**

**కల్వకుర్తి జనవరి 8 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో గురువారం జాతీయ యువజన దినోత్సవం స్వామివివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాల లో సమాజంలో జర్నలిజం విలువలు ప్రభావం అంశం పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధి, వక్త గా జాతీయ విద్య భారతి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మురళి మనోహర్ హాజరయ్యారు.అనంతరం ప్రొఫెసర్ మురళి మనోహర్ మాట్లాడుతూ యువత దేశానికి భారం కావొద్దు అన్ని రంగాల్లో రానించాలి అలాగే యువత చదువుతో పాటు సామజిక స్పృహ పెంచుకోవాలి, ఇంగ్లీష్ పై పట్టు సాధించాలి, జర్నలిజం వలన సామజిక చైతన్యం జరుగుతుంది అని, వివేకానంద ఆశయాలు యువతకు ఆదర్శం అని కోరారు. అనంతరం పట్టణ సీనియర్ జర్నలిస్టులు ప్రహలాద్, శేఖర్ గౌడ్ లు సమాజంలో జర్నలిస్ట్ ల పాత్ర సేవలు ఎలా ప్రభావితం చేస్తాయి అని తెలిపారు. అలాగే అతిధులకు స్వామివివేకానంద చిత్రపటాలను బహుకరించడం జరిగింది.కార్యక్రమంలో స్వామివివేకానంద సేవా బృందం ఆధ్యక్షుడు శివ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద శార్వని, నాయకులు దుర్గాప్రసాద్,బోడ నర్సింహా, ఏబీవీపీ మల్లేష్ యాదవ్,భగత్ సింగ్ సేవా బృందం సభ్యులు లక్ష్మి నరసింహ, గౌతమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నేడు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటన

**పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్**

**కల్వకుర్తి జనవరి 8 (అక్షర గళం):**

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ గురువారం మీడియాకు తెలిపారు ఉదయం 10 గంటలకు రెండవ వార్డు కళ్యాణ్ నగర్ లో 50 లక్షలతో కాల్వ పనులకు శంకుస్థాపన 10:30 ఆరవ వార్డు సిరార్ పల్లి లో నూతన సబ్ స్టేషన్ తిమ్మరాజు పల్లి లో 33/11kv లకు శంకుస్థాపన చేస్తారని 11:30 గంటలకు బలరాం నగర్ కాలనీలో రెండు కోట్ల 50 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల అండర్ డ్రైనేజ్ పనులు ప్రారంభోత్సవం 12 గంటలకు రెండు కోట్ల రూపాయలతో మహబూబ్నగర్ చౌరస్తా నుండి శివాజీ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ మరియు సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన కార్యక్రమం 12:15 పాత చిన్న నీటి పారుదల శాఖ స్థలంలో నాలుగు కోట్ల రూపాయలతో 56 షట్టర్ల నిర్మాణ షాపింగ్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మూడు గంటలకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు పార్టీ నాయకులు కార్యకర్తలు ఉదయం 10 గంటలకు క్యాంప్ ఆఫీస్ కు రావాలని కోరారు.




## తల్లిదండ్రులకు కన్నీళ్లు మిగల్చకండి

**- జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం**

**ఆమనగల్లు, జనవరి 08 (అక్షర గళం):**


టీనేజి యువకులు అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనాలు నడుపుతూ మృత్యు వాత పడి తల్లిదండ్రులకు కన్నీళ్లు మిగుల్చుతున్నారని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటమ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె న్యాయవాదులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని కోరారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల తన ప్రాణంతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా హరిస్తున్నారని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తోపాటు మోటార్ వాహనానికి ఇన్సూరెన్స్ తప్పక ఉంచుకోవాలని సూచించారు. బయటకు వెళ్లినప్పుడు ప్రతి వాహనదారుడు హెల్మెట్ను తప్పనిసరిగ్గా ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్, బార్ అసోసియేషన్ కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, కోశాధికారి కొప్పు కృష్ణ, గ్రంథాలయ సెక్రటరీ మల్లేష్, క్రీడా కార్యదర్శి ఏ శేఖర్, మరియు సభ్యులు.సీనియర్ న్యాయవాదులు మల్లేష్, మధు గౌడ్, జగన్ గౌడ్, శివ శంకర్, శ్రీనివాస్, శ్రీశైలం, స్థానిక ఎస్సై వెంకటేష్ పోలీస్ ఆమనగల్లు జూనియర్ కోర్టు సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, ఇందులో స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ పి ఎల్వి డిఎల్ ఎస్ఏ బాల్ రెడ్డి, కోర్టు సిబ్బంది శివ, ఉమామహేశ్వర్, రవి కిరణ్, మల్లేష్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## కూతురు జన్మదిన సందర్భంగా పలుకల పంపిణీ

**వెల్దండ జనవరి 08 (అక్షర గళం):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన ఆర్య వైశ్య సంఘం నాయకులు, ప్రజాదర్బార్ రిపోర్టర్ బిక్కుమండ్ల శ్రీనివాస్ కూతురు రమ్య జన్మదినం సందర్భంగా గురు వారం తక్షశిల పాఠశాలలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ చేతుల మీదుగా పలకలను పంపిణీ చేశారు .ఈ కార్య క్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను వార్డు నెంబర్ సభ్యులు మారేపల్లి శ్రీను నాయకులు పుల్లయ్య ఎండి రషీద్ తిరు పతి రెడ్డి అంజయ్య మట్ట భరత్ గౌడ్ పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఇండిగో విమానాలు టైమ్‌కు వస్తాయ్



గగనతల పరిమితులు, సిబ్బంది కొరత, విమానయాన రంగంలోని సవాళ్లను దాటుకొని ఎయిర్‌లైన్స్ సంస్థలు సమయానికి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి . అలా అత్యంత సమయపాలన పాటిస్తోన్న సంస్థల జాబితాను ఏవియేషన్ అనలిటిక్స్ సంస్థ సిరియం వెల్లడించింది. గత ఏడాదికి సంబంధించి ఆన్‌టైమ్ ఫెర్మామెన్స్ రివ్యూను విడుదల చేసింది. ఏరోమెక్సికో వరుసగా రెండోఏడాది అత్యంత సమయ పాలన (90.02) కలిగిన ఎయిర్‌లైన్స్‌గా అగ్రస్థానంలో నిలిచింది ఖతర్ ఎయిర్‌లైన్స్..84.42 శాతం ఆన్‌టైమ్‌తో ప్లాటినం విన్నర్‌గా నిలిచింది.ఆసియాపసిఫిక్ ప్రాంతంలో ఫిలిప్పీన్ ఎయిర్‌లైన్స్ ప్రథమ స్థానంలో నిలిచింది. 83.12 శాతం ఆన్‌టైమ్ ప్రదర్శన చూపింది. ఇదే ప్రాంతంలో ఇండిగో ఆరో స్థానంలో ఉంది. 78.12 శాతం ఆన్‌టైమ్ ప్రదర్శన నమోదు చేసింది. ఇటీవల ఇండిగో విమానయాన సంస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. సిబ్బంది కొరత వంటి ఆపరేషనల్ సమస్యలతో వందల సంఖ్యలో విమానాలను రద్దు చేసింది. దాంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

## 24 ఏళ్ల బజాజ్‌అలియాంజ్ బంధానికి బ్రేక్

BAJAJ FINSERV

**దిల్లీ:** బజాజ్‌కు చెందిన జీవిత బీమా వ్యాపారంలో అలయాంజ్‌తో ఉన్న సుదీర్ఘ భాగస్వామ్యం ముగిసింది. జర్మనీకి చెందిన అలియాంజ్ ఎస్ఈకి ఉన్న 23 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ గురువారం తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. దీంతో 24 ఏళ్ల పాటు కొనసాగిన జాయింట్ వెంచర్ భాగస్వామ్యం ముగిసింది. దీంతో బీమా వ్యాపారం పూర్తిగా బజాజ్ గ్రూప్ చేతుల్లోకి వచ్చింది.

బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో అలియాంజ్ వాటాను ప్రమోటర్ గ్రూప్ సంస్థలైన బజాజ్ హోల్డింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్, జమన్‌లాల్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి కొనుగోలు చేసినట్లు బజాజ్ ఫిన్‌సర్వ్ వెల్లడించింది. జనరల్ ఇన్సూరెన్స్‌లో వాటా కోసం రూ.12,190 కోట్లు, లైఫ్ ఇన్సూరెన్స్‌లో వాటాకు రూ.9200 కోట్లు చొప్పున మొత్తం రూ.21,390 కోట్లు వెచ్చించినట్లు పేర్కొంది. ఈ లావాదేవీతో ఇరు సంస్థల్లో బజాజ్ వాటా 74 శాతం నుంచి 97 శాతానికి పెరిగింది. రెండు సంస్థల్లో బజాజ్ ఫిన్‌సర్వ్‌కు 75.01 శాతం వాటా ఉంది.

ఈ కొనుగోలుతో మార్కెట్‌ను మరింత విస్తరించడానికి, కొత్త ఉత్పత్తులు తీసుకురావడానికి వ్యూహాత్మక సౌలభ్యం లభిస్తుందని బజాజ్ ఫిన్‌సర్వ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ బజాజ్ పేర్కొన్నారు. 'అందరికీ బీమా' ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని మేడిన్ ఇండియా, మేడ్ ఫర్ ఇండియా, మేడ్ బై ఇండియా ద్వారా సాకారం చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే బజాజ్ తన బీమా వ్యాపారాల సంస్థల పేర్లను బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌గా మార్చింది. ఇంతకుమునుపు వీటి పేర్లు బజాజ్ అలయాంజ్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్ అలయాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్‌గా ఉండేవి.

## పోకో నుంచి M8 5జీ విడుదల, ₹7వేలు డిస్కౌంట్!




షావోమీ అనుబంధ సంస్థ పోకో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. పోకో ఎం8 5జీ పేరిట దీన్ని విడుదల చేసింది. ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 15తో పనిచేసే హైపర్‌ఓఎస్ 2.0తో పని చేస్తుంది. ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్‌ఓఎస్ 3ని త్వరలో విడుదల చేయనున్నారు. ఈ ఫోన్‌కు నాలుగేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్లు ఇస్తామని కంపెనీ పేర్కొంది.

ఇందులో 6.76 అంగుళాల 3డీ కర్వ్‌డ్ డిస్‌ప్లే, 120Hz రిఫ్రెష్ రేటు ఇచ్చారు. 3200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 3 ప్రాసెసర్ ఇచ్చారు. ఈ ఫోన్‌లో 50 ఎంపీ ప్రధాన కెమెరాతో పాటు 2 ఎంపీ లైట్ ఫ్యూజన్ 400 సెన్సర్ అమర్చారు. 20 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఉంది. ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంది. 5,520 ఎంఏహెచ్ బ్యాటరీ, 45W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 18W రివర్స్ వైర్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. ఐపీ65+ ఐపీ 66 రేటింగ్‌తో కూడిన డస్ట్, వాటర్ రెసిస్టెన్స్‌తో వస్తోంది.

### ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్.. ఎప్పటినుంచంటే?

ఈ ఫోన్ ధర విషయానికొస్తే.. ఇది మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 6జీబీ+ 128జీబీ ధర రూ.21,999గా కంపెనీ పేర్కొంది. 8జీబీ+ 128జీబీ వేరియంట్ ధర రూ.22,999గానూ, 8జీబీ+ 256జీబీ స్టోరేజీ వేరియంట్ ధరను రూ.24,999గా నిర్ణయించింది. ప్రారంభ ఆఫర్ కింద తొలి 12 గంటల్లో కొనుగోలు చేసే వారికి హ్యాండ్‌సెట్‌ను రూ.15,999కే అందిస్తామని వెల్లడించింది. సాధారణ కొనుగోళ్లపై రూ.2వేలు కార్డ్ డిస్కౌంట్, రూ.1000 అదనపు డిస్కౌంట్ అందిస్తామని పేర్కొంది. జనవరి 13 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయలు ప్రారంభం కానున్నాయి. కార్బన్ బ్లాక్, గ్లాసియల్ బ్లూ, ఫ్రాస్ట్ సిల్వర్ రంగుల్లో లభిస్తుంది.

## ఎనిమిదేళ్ల తర్వాత ఎయిరిండియా చేతికి డ్రీమ్‌లైనర్

**దిల్లీ:** టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా కొనుగోళ్లు జరిపిన విమానాలు ఒక్కొక్కొటిగా అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా బోయింగ్‌కు చెందిన 7879 విమానం సంస్థ చెంతకు చేరింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత డ్రీమ్‌లైనర్ విమానం ఎయిరిండియా ఫ్లీట్ లో చేరడం గమనార్హం. ప్రైవేటీకరణ తర్వాత ఇదే తొలి డ్రీమ్‌లైనర్ కావడం విశేషం. జనవరి 7న సియాటెల్‌లోని తన ప్లాంట్ నుంచి బోయింగ్ ఈ విమానాన్ని డెలివరీ చేయగా... ఎయిరిండియా అందుకుంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తనిఖీల అనంతరం ప్రయాణానికి అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు 2017 అక్టోబర్‌లో చివరి డ్రీమ్‌లైనర్ ఎయిరిండియాలో చేరింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మరో డ్రీమ్‌లైనర్ కంపెనీకి చేరింది. సంస్థ అవసరాలకు అనుగుణంగా ఈ డ్రీమ్‌లైనర్‌ను బోయింగ్ రూపొందించింది. దీంట్లో ఎకానమీ, ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ తరగతులు ఉండనున్నాయి. ఎయిరిండియాను కొనుగోలు చేసిన తర్వాత 2023లో 350 ఎయిర్‌బస్, 220 బోయింగ్ విమానాలకు టాటా గ్రూప్ ఆర్డర్ పెట్టిన సంగతి తెలిసిందే. 185 ఎయిరిండియా నడుపుతుండగా.. మిగిలినవి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నిర్వహిస్తోంది.

# ఒక్కరోజులోనే ₹8 లక్షల కోట్లు ఆవిరి!



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్ అమెరికా మధ్య వాణిజ్యంపై సందిగ్ధత నెలకొన్న వేళ.. సూచీలు భారీ ఒత్తిడి ఎదుర్కొన్నాయి. రష్యాను కట్టడి చేసేందుకు భారత్ వంటి దేశాలపై 500 శాతం సుంకాలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాలు, భౌగోళిక ఉద్రిక్తతల వంటివీ ఆజ్యం పోశాయి. దీంతో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 26వేల దిగువన ముగిసింది. దీంతో మదుపర్ల సంపద రూ.8 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.480 లక్షల కోట్ల నుంచి రూ.472 లక్షల కోట్లకు దిగొచ్చింది.

### సంపాదనను ఇచ్చేస్తా: కుమారుడి మరణం వేళ వేదాంతా ఛైర్మన్

- సెన్సెక్స్ ఉదయం 84,778.02 (క్రితం ముగింపు 84,961.14) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,110.10 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 780.18 పాయింట్ల నష్టంతో 84,180.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 263.90 పాయింట్ల నష్టంతో 25,876.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.95గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 60.35 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం 4,426.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### కారణాలు ఇవీ..

- రష్యాపై ఆంక్షలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ట్రంప్ ఆమోదం తెలిపారు. దీంతో రష్యా ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై 500 శాతం వరకు టారిఫ్ విధించే అధికారం అధ్యక్షుడికి లభిస్తుంది.
- భారత్‌పై అదనపు సుంకాలు విధిస్తానని ట్రంప్ తాజా హెచ్చరికల నేపథ్యంలో ఈ బిల్లు తీసుకురావడం మదుపర్లలో భయాలు పెంచింది.
- దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా రూ.1527 కోట్ల ఈక్విటీ షేర్లను విదేశీ మదుపర్లు విక్రయించారు. ఈ ఒక్క నెలలోనే రూ.5,760 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం ప్రతికూల ప్రభావం చూపింది.
- భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు మన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఆసియాలో జపాన్ నిక్కీ, హాంగ్‌కాంగ్ హాంగ్‌సంగ్ నష్టాల్లో ముగిశాయి. నిన్నటి అమెరికన్ మార్కెట్లు సైతం నష్టాలు చవిచూశాయి.

# 'బ్యాంక్ ఆఫ్ అమెరికా'కు సెబీ నోటీసులు..!



భారత స్టాక్ మార్కెట్లకు చెందిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను బ్యాంక్ ఆఫ్ అమెరికా ఉల్లంఘించిందని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఆరోపించింది. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ స్టాక్ విక్రయాలకు సంబంధించిన డీల్ వేళ రహస్య సమాచారాన్ని లీక్ చేసిందని పేర్కొంది. అంతేగాక, ఈ వ్యవహారంపై దర్యాప్తును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసిందంటూ బ్యాంక్ ఆఫ్ అమెరికాకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. గత నవంబరులోనే ఈ నోటీసులను జారీ చేయగా.. తాజాగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం వెల్లడించింది.

2024 మార్చిలో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ స్టాక్ విక్రయాలకు సంబంధించిన లావాదేవీలను భారత్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికా నిర్వహించింది. ఈ విక్రయాల విలువ దాదాపు 177 మిలియన్ డాలర్లు. ఆ సమయంలో స్టాక్ ధర, ఇతర రహస్య వివరాలను బ్యాంకు డీల్ టీమ్.. ఉద్యోగులు, ఇన్వెస్టర్లతో పంచుకుందని ఓ ప్రజావేగు ఆరోపించారు. దీంతో బ్యాంక్ ఆఫ్ అమెరికా అంతర్గత దర్యాప్తు జరిపి.. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని పేర్కొంది.ఈ క్రమంలోనే ఈ వ్యవహారంపై సెబీ దర్యాప్తు చేపట్టగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ డీల్ విషయంలో అంతర్గత నైతిక కట్టుబాట్లను విస్మరించి బ్యాంక్ ఆఫ్ అమెరికా డీల్ టీమ్ రహస్య సమాచారాన్ని బయటపెట్టిందని సెబీ పేర్కొంది. వాస్తవాలను దాచి.. తప్పుడు స్టేట్‌మెంట్లతో దర్యాప్తును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని ఆరోపించింది. అయితే, దీనిపై బ్యాంక్ ఆఫ్ అమెరికా గానీ.. సెబీ గానీ ఇంతవరకూ స్పందించలేదు. మరోవైపు, ఈ వ్యవహారంపై సెటిల్‌మెంట్‌కు సెబీ వద్ద బ్యాంక్ ఆఫ్ అమెరికా అప్లికేషన్ దాఖలు చేసినట్లు సమాచారం.



## క్యాసినోల నుంచి రూ.వేల కోట్లు కొల్లగొట్టి!

భారీస్థాయిలో ఆన్‌లైన్ మోసాల నెట్‌వర్క్ నడుపుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చైనా బిజినెస్ టైకూన్ చెన్ జీని కంబోడియా ఇటీవల అరెస్టు చేసింది. అతడిని స్వదేశానికి అప్పగించింది. ఆన్‌లైన్ మోసాల కోసం అతడి సంస్థ.. మానవ అక్రమ రవాణా బాధితులనూ సిబ్బందిగా నియమించుకున్నట్లు అమెరికా, బ్రిటన్ అధికారులు ఆరోపించారు. ఈ పరిణామాలతో ఆగ్నేయాసియా అడ్డాగా కోరలు చాచిన సైబర్ నేర ముఠాల వ్యవహారం మరోసారి వార్తల్లో నిలిచింది.

హలో.. పార్ట్‌టైం జాబ్ కావాలా?.. ఇలా సాధారణ సందేశాలతో ఈ సైబర్ మోసాలు మొదలవుతాయి. ఈ సందేశాల వెనుక.. బలవంతంగా పనిచేస్తున్న కార్మికులు ఉంటారు. రోజూ వందలాది మెసేజెస్ పంపుతారు. రిప్లై వచ్చిందా.. మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడి బాధితుల నగదు కొల్లగొడుతారు. ఒక్క 2024లోనే ఆగ్నేయాసియా స్కామ్‌ల బారినపడి అమెరికన్లు దాదాపు 10 బిలియన్ డాలర్లు కోల్పోయినట్లు ప్రభుత్వ వర్గాల అంచనా.

ఐరాస 2023 నాటి ఓ నివేదిక ప్రకారం.. మయన్మార్‌లో దాదాపు 1.20 లక్షలమంది సైబర్ ముఠాల చెరలో ఉన్నారు. కంబోడియాలో దాదాపు లక్షమంది ఉన్నారు. వీరిలో కొందరిని అక్రమంగా రవాణా చేసి తీసుకొస్తారు. మరికొందరిని అధిక వేతనాలు, సులభమైన ఉద్యోగాల పేరిట నమ్మించి రప్పిస్తారు. 56కు పైగా దేశాల కార్మికులు ఈ ఊబిలో కూరుకుపోయారు.

# హైదరాబాద్‌లో 4% పెరిగిన ఇళ్ల అమ్మకాలు

**కార్యాలయాల అద్దె లావాదేవీల్లో 10% వృద్ధి**
**నైట్ ఫ్రాంక్ నివేదిక**

**హైదరాబాద్:** దేశీయ స్థిరాస్తి రంగంలో హైదరాబాద్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. 2025 ద్వితీయార్థంలో కార్యాలయాల అద్దె లావాదేవీలు, నివాస గృహాల విక్రయంలో దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే హైదరాబాద్ మెరుగ్గా ఉందని స్థిరాస్తి సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన 'ఇండియా రియల్ ఎస్టేట్ హెచ్2 2025' నివేదిక తెలిపింది. దేశంలోని 8 నగరాల్లో కలిపి ఇళ్ల అమ్మకాలు 1% తగ్గినా, హైదరాబాద్‌లో పెరిగినట్లు వివరించింది. 2025 జులైడిసెంబరు మధ్య హైదరాబాద్‌లో మొత్తం 38,403 ఇళ్లు/ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. 2024 ఇదే కాలంతో పోలిస్తే ఇవి 4% ఎక్కువ. విక్రయాల్లో పశ్చిమ హైదరాబాద్ ప్రాంతం ఏకంగా 63% వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. నగరంలో ఇళ్ల కొనుగోలుదారుల ప్రాధాన్యం మారుతోందని నివేదిక వెల్లడించింది. అమ్ముడైన మొత్తం ఇళ్లలో రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్నవే 71 శాతమని తెలిపింది. ఇళ్ల సగటు ధరల్లోనూ ఏటా 13% వృద్ధి కనిపించింది. మౌలిక సదుపాయాల విస్తరణ, ఐటీ రంగంలో ఉద్యోగాల పెరుగుదల ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నైట్ ఫ్రాంక్ పేర్కొంది. జీసీసీలతో...: హైదరాబాద్‌లో మొత్తం 1.14 కోట్ల చ.అడుగుల కార్యాలయ స్థలం లీజుకు వెళ్లింది. ఈ లావాదేవీల్లో సగానికి పైగా వాటా గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ)దే. కొత్త జీసీసీల్లో హైదరాబాద్ అగ్రగామిగా నిలిచింది. చార్లెస్ స్క్వాబ్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, గోల్డ్‌మన్ శాక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ భారీ విస్తీర్ణాన్ని లీజుకు తీసుకున్నాయి. కార్యాలయాల అద్దె ధరల్లోనూ సగటున 10% వృద్ధి కనిపించింది. 8 నగరాలను పరిశీలిస్తే: దేశంలోని 8 ప్రధాన నగరాలైన హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ముంబయి, ఎన్‌సీఆర్, పుణేలలో కలిపి మొత్తం 3.5 లక్షల ఇళ్లు/ఫ్లాట్లు విక్రయం అయ్యాయి.

# మైక్రోసాఫ్ట్‌లో 22వేల మందికి లేఆఫ్..!




కృత్రిమ మేధ వినియోగం వేళ దిగ్గజ కంపెనీల్లో లేఆఫ్‌లు గత కొంతకాలంగా టెక్ రంగాన్ని కుదిపేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ మైక్రోసాఫ్ట్‌లో మరోసారి భారీఎత్తున తొలగింపులంటూ ఓ నివేదిక రావడం గందరగోళానికి గురిచేసింది. జనవరిలో దాదాపు 22వేల మందికి కంపెనీ ఉద్వాసన పలకనుందన్న వార్త ఉద్యోగుల్లో ఆందోళనకు దారితీసింది. దీంతో ఈ ప్రచారంపై కంపెనీ స్పందిస్తూ.. అవన్నీ నిరాధార వార్తలని స్పష్టం చేసింది. అసలేం జరిగిందంటే..? టిప్‌ర్యాంక్స్ ( రీసెర్చ్ అండ్ అనాలసిస్ కంపెనీ) నివేదికతో ఈ ప్రచారం మొదలైంది.

ఈ ఏడాది జనవరిలో మైక్రోసాఫ్ట్ 11వేల నుంచి 22వేల మంది ఉద్యోగులకు లేఆఫ్‌లు ఇవ్వాలని భావిస్తున్నట్లు ఆ నివేదిక పేర్కొంది. అజ్యూర్ క్లౌడ్ సర్వీసెస్, ఎక్స్‌బాక్స్, గ్లోబల్ సేల్స్ ఆపరేషన్స్ వంటి విభాగాల్లో ఈ కోతలు ఉండొచ్చని తెలిపింది. ఖర్చులు పెరగడం, కృత్రిమ మేధలో పెట్టుబడులు వంటి కారణాలతో ఈ తొలగింపులు చేపట్టాలని మైక్రోసాఫ్ట్ యోచిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. దీంతో ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

### సంపద సృష్టికి బంగారం మేలు

ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్ చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ ఫ్రాంక్ ఎక్స్ షా సోషల్ మీడియాలో స్పందించారు. "ఇవన్నీ 100శాతం నిరాధార వార్తలే. ఉద్యోగుల కోత అవాస్తవం" అని వెల్లడించారు. అంతకుముందు విండోస్ సెంట్రల్ ఎడిటర్ జెజ్ కార్డన్ స్పందిస్తూ.. లేఆఫ్‌ల సమాచారం తప్పని తెలిపారు. అయితే, దీనిపై కంపెనీ తరఫున మైక్రోసాఫ్ట్ అధికారిక ప్రకటన ఏదీ విడుదల చేయలేదు. గతేడాది జులైలో భారీ సంఖ్యలో తొలగింపులు చేపట్టిన సంగతి తెలిసిందే. దాదాపు 9వేల మందికి లేఆఫ్ నోటీసులు ఇచ్చింది. అప్పట్లో దీనిపై ఎక్స్‌బాక్స్ హెడ్ ఫిల్ స్పెన్సర్ మాట్లాడుతూ.. కంపెనీ దీర్ఘకాల ప్రణాళికలో భాగంగా ఈ కోతలు తప్పలేదని పేర్కొన్నారు. ఆ లేఆఫ్‌ల సమయంలోనే పలు గేమ్ ప్రాజెక్ట్‌లను కంపెనీ రద్దు చేసుకుంది. కొన్ని స్టూడియోలను మూసేసింది. మరోవైపు గతేడాది జులై నాటికి మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ 4 ట్రిలియన్ల మార్క్‌ను తాకడం గమనార్హం.

## ఐసిసిపై బంగ్లాదేశ్ తీవ్ర ఆరోపణలు

బంగ్లాదేశ్ యువ, క్రీడా వ్యవహారాల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఒక ప్రశ్న లేవనెత్తారు, బహుశా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఇప్పటికీ బంగ్లాదేశ్ పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయిందని అన్నారు. ఐసిసి నుంచి వచ్చిన లేఖను ఉటంకిస్తూ, బంగ్లాదేశ్ తీసుకున్న తీవ్రమైన భద్రతా సమస్యల గురించి తెలుసుకోవడం లేదని ఆసిఫ్ నజ్రుల్ అన్నారు. అంతేకాకుండా, అవమానాన్ని సహించనని కూడా ఆయన అన్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను విడుదల చేసిన తర్వాత, భారత్, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. కొంతకాలం తర్వాత, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ జట్టు టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని కోరింది. ఆసిఫ్ నజ్రుల్ మాట్లాడుతూ, ''ఈ రోజు మాకు అందిన ఐసీసి లేఖను చదివిన తర్వాత, భారత దేశంలో బంగ్లాదేశ్ క్రికెటర్లకు ఎదురవుతున్న భద్రత ఉండదని, దాన్ని వారు సరిగ్గా అర్థం చేసుకోలేదని మేము అర్థం చేసుకున్నాము. ఇది కేవలం భద్రతా సమస్య మాత్రమే కాదు, ఇక్కడ దేశానికి కూడా అవమానం జరుగుతుంది. అయినప్పటికీ, మేము దీనిని ప్రాథమికంగా భద్రతా సమస్యగా పరిగణిస్తున్నాము.'' ఆసిఫ్ నజ్రుల్ మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో క్రికెట్‌పై అపారమైన క్రేజ్ ఉందని, జట్టు కచ్చితంగా ప్రపంచ కప్ ఆడాలని కోరుకుంటుంది. ఆయన ఇంకా మాట్లాడుతూ, ''మేము భారత్‌లో మతపరమైన ఘర్షణ పరిస్థితిని చర్చించకూడదనుకుంటున్నాము, కానీ మన క్రికెటర్ల భద్రత, బంగ్లాదేశ్ గౌరవం గురించి మాట్లాడేటప్పుడు, ఈ ప్రశ్న తలెత్తడం అనివార్యం.''
నజ్రుల్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ గురించి కూడా మాట్లాడారు. బీసిసిఐని లక్ష్యంగా చేసుకుని, ''భారత క్రికెట్ బోర్డు స్వయంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఈ ప్రత్యేక ఆటగాడికి భద్రత కల్పించలేమని, అతన్ని డ్రాప్ చేయమని చెప్పినప్పుడు, భారతదేశంలో ఆడటం మాకు సురక్షితం కాదని ఇది స్పష్టం చేస్తోంది.''

# భారత్‌కు భారీ ఎదురుదెబ్బ

### తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయం
### నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం





టీ20 వరల్డ్ ?కప్? ముంగిట భారత్ ?కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. యంగ్ బ్యాటర్ తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయమైంది. దీంతో అతడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న తిలక్ ?కు ఇటీవల పొట్ట కింది భాగంలో నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారు. డాక్టర్ల సూచన మేరకు అతడికి సర్జరీ చేయించారు. ప్రస్తుతానికి అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది.ఈ సర్జరీ కారణంగా తిలక్ వర్మ నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. దీంతో ఇదే నెలలో న్యూజిలాండ్ ?తో జరగాల్సిన టీ20 సిరీస్ ?కు అతడు దూరం కానున్నాడు. జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో జరగాల్సిన ఐదు మ్యాచ్ ?ల సిరీస్ ?కు తిలక్ ? ఎంపికైయ్యాడు. కానీ సర్జరీ కావడంతో ఈ సిరీస్ ?కు తిలక్ అందుబాటులో ఉండడు. అతని స్థానంలో ఇంకో ప్లేయర్ ?ను ప్రకటించాల్సి ఉంది.అయితే తిలక్ లాంటి హిట్టింగ్ బ్యాటర్ వరల్డ్ ?కప్ ?కు ముందు గాయపడడం భారత్ ?కు పెద్ద దెబ్బ! వచ్చే నెల 07న టోర్నమెంట్ ప్రారంభం కానుంది. అప్పటిలోగా అతడు పూర్తిగా కోలుకొని ఫిట్ ?గా అవ్వాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. అయితే తిలక్ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే వరల్డ్ ?కప్ ?లో అతడు ప్రారంభ మ్యాచ్ ?లకు అందుబాటులో ఉండడాన్ని కచ్చితంగా చెప్పలేం!విజయ్ హాజారేలో హైదరాబాద్ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్ ?గా వ్యవహరిస్తున్నాడు. ఈ టోర్నీలో తొలి నాలుగు మ్యాచ్ ?ల్లో హైదరాబాద్ ఓడడంతో క్వాలిఫైయర్స్ ?కు అర్హత సాధించలేదు. రీసెంట్ ?గా చండీగఢ్, బంగాల్ జట్లతో జరిగిన మ్యాచ్ ?ల్లో హైదరాబాద్ విజయం సాధించింది. దీంతో ఇప్పటిదాకా ఆరు మ్యాచ్ ?ల్లో నాలుగు ఓడి, రెండిరట నెగ్గింది.గతేడాది సెప్టెంబర్ ?లో జరిగిన ఆసియా కప్ ఫైనల్ ?లో తిలక్ వర్మ అద్భుతంగా పోరాడాడు. 150 పరుగుల ఛేదనలో 53 బంతుల్లో 69 పరుగులతో రాణించి టీమ్ ఇండియాను గెలిపించాడు. పాకిస్థాన్ ?పై ఒత్తిడితో కూడిన మ్యాచ్ ?లో తిలక్ పోరాటం అందర్నీ ఆకట్టుకుంది. ఇప్పటిదాకా అతడి కెరీర్ ?లో ఇదే అత్యుత్తమ ఇన్నింగ్స్ అనడంలో ఎలాంటి డౌట్ లేదు. కాగా, 2023లో తిలక్ అంతర్జాతీయ క్రికెట్ ?లో అడుగుపెట్టాడు. ఇప్పటిదాకా 40 మ్యాచ్ ?ల్లో 49 యావరేజ్ ?తో 1182 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. స్ట్రైక్ రేట్ ? 143.98గా ఉంది. టీమ్ ఇండియా వరల్డ్ ?కప్ జట్టు : అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకు సింగ్, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, ఇషాన్ కిషన్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.



# 4/1తేడాతో యాషెస్ ఆసీస్ కైవసం

**చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా విజయం**
**5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ పై విక్టరీ**

యాషెస్ చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా విజయం సాధించింది. సిడ్నీ వేదికగా జరిగిన ఐదో మ్యాచ్ ?లో ఇంగ్లాండ్ ?పై ఆసీస్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. 160 పరుగులు స్వల్ప ఛేదనలో ఆసీస్ 5 వికెట్లు కోల్పోయి లక్ష్యన్ని అందుకుంది. మార్నస్ లబుషేన్ (37), జేక్ వెదరాల్డ్ (34) రాణించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 3, విల్ జాక్స్ 1 వికెట్ దక్కించుకున్నారు. దీంతో ఐదు టెస్టుల యాషెస్ సిరీస్ ?ను ఆస్ట్రేలియా 4/1 తేడాతో దక్కించుకుంది. అంతకు ముందు ఓవర్ నైట్ స్కోరుతో ఐదో రోజు బ్యాటింగ్ కొనసాగించిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జాకబ్ బెతెల్ (154 పరుగులు) భారీ సెంచరీతో ఆకట్టుకున్నాడు. హ్యారీ బ్రూక్ (42), బెన్ డకెట్ (42) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, వెబ్ ?స్టర్ చెరో 3, బొలాండ్ 2, నెసర్ 1 వికెట్ తీశాడు. దీంతో ఆస్ట్రేలియా ముందు 160 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. ఈ లక్ష్యన్ని ఆసీస్ 5 వికెట్లు కోల్పోయి 31.2 ఓవర్లలో ఛేదించింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (16) విన్నింగ్ షాట్ బాదాడు. కామెరూన్ గ్రీన్ 22 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. ''మా జట్టు ప్రదర్శన అద్భుతం. అందరూ సమష్టిగా రాణించారు. ముఖ్యంగా స్టార్క్, హెడ్, క్యారీలు ఈ సిరీస్‌లో నిలిచిపోయే ప్రదర్శన చేశారు'' అని ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అన్నాడు. ఇక ''మేము ఇంతకంటే బాగా ఆడాల్సింది. కానీ ఆస్ట్రేలియా ఐదు టెస్టుల్లోనూ అద్భుతంగా ఆడిరది'' అని ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రత్యర్థిని కొనియాడాడు. కాగా, ఈ సిరీస్ ?లో పాట్ కమిన్స్ గైర్హాజరీలో స్మిత్ 4 టెస్టులకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.ఈ సిరీస్ ?లో ఆసీస్ ప్లేయర్లు రికార్డులు సృష్టించారు. పేసర్ మిచెల్ స్టార్క్ ఈ సిరీస్‌లో 19.9 సగటుతో ఏకంగా 31 వికెట్లు పడగొట్టాడు. దీంతో అతడు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ష గా ఎంపికైయ్యాడు. అటు బ్యాటింగ్ ?లో ట్రావిస్ హెడ్ మూడు భారీ సెంచరీలతో రెచ్చిపోయాడు. సిరీస్ ?లో ఏకంగా 629 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ కూడా 28 డిస్మిసల్స్‌తో ఆకట్టుకున్నాడు. చివరి రోజు ఆటలో థర్డ్ అంపైర్ నిర్ణయం కాంట్రవర్సీ అయ్యింది. ఆసీస్ బ్యాటర్ జేక్ వెదరాల్డ్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు బంతి బ్యాట్‌కు తాకినట్లు అనిపించింది. ఇంగ్లాండ్ అప్పీల్ చేయగా అంపైర్ నాటౌట్ ఇచ్చారు. డీఆర్ఎస్ ?లో స్నికో మీటర్‌లో చిన్న కదలిక కనిపించింది. అయినా థర్డ్ అంపైర్ నాటౌట్ గా ప్రకటించడంతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు షాక్ అయ్యారు. కెప్టెన్ స్టోక్స్ అంపైర్లతో వాగ్వాదానికి దిగినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్ ?తో ఆసీస్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా కెరీర్ ? ముగిసింది. అతడికి ఇదే చివరి టెస్టు కావడంతో మైదానంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది.

# బ్యాటింగ్ వైఫల్యంతోనే ఓటమి: బెన్ స్టోక్స్

బ్యాటింగ్ వైఫల్యంతోనే ఓటమిపాలయ్యామని ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తెలిపాడు. ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌అబశ్రీశ్రీలో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్‌లోనూ ఆసీస్ 5 వికెట్లతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపుతో ఈ ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 41తో కైవసం చేసుకుంది. ఆఖరి టెస్ట్ అనంతరం మాట్లాడిన బెన్ స్టోక్స్.. తొలి ఇన్నింగ్స్‌లో అదనంగా 100 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్నాడు. ఆస్ట్రేలియాకు కూడా తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగులు తక్కువగా ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డాడు.'నా కాలు గాయం కాస్త మెరుగ్గానే ఉంది. కొన్నిసార్లు తీవ్ర నొప్పితో ఇబ్బంది పడుతున్నాను. ఇంటికి వెళ్లే వరకు ఈ గాయంపై స్పష్టత రాదు. ఈ మ్యాచ్‌లో ఓడినా భాగమవ్వడం ఒక గొప్ప అనుభూతి. మేం తొలి ఇన్నింగ్స్‌లో మరో 100 పరుగులు అదనంగా చేసి ఉండాల్సింది. అలాగే ఆస్ట్రేలియా 100 పరుగులకు తక్కువకే కట్టడి చేయాల్సింది. ఆస్ట్రేలియా అద్భుతమైన జట్టు. అందులో వ్యక్తిగత ప్రదర్శనలతో జట్టును ఆదుకునే ఆటగాళ్లు ఉన్నారు. ఈ విజయం క్రెడిట్ పూర్తిగా వారికే దక్కుతుంది. అయితే ఈ సిరీస్‌లో మేం ఇంకాస్త మెరుగ్గా రాణించాల్సింది. మా లోపాలను సమీక్షించుకోవడానికి ఇది సరైన సమయం కాదు. ఈ ఓటమిని విశ్లేషించుకోవడానికి మాకు చాలా సమయం ఉంది. వచ్చే జూన్‌లో మేం మళ్లీ టెస్ట్ క్రికెట్ ఆడనున్నాం. ఆ సమయానికి మా తప్పులను సరిదిద్దుకుంటాం.ఈ మ్యాచ్‌లో జాకోబ్ బెత్ ఆడిన ఇన్నింగ్స్ అద్భుతం. జోష్ టంగ్ ప్రదర్శన రోజురోజుకూ మెరుగవుతుంది. అతను నిలకడగా రాణిస్తున్నాడు. మా జట్టులో అసాధారణ ఆటగాళ్లు ఉన్నారు.'అని బెన్ స్టోక్స్ చెప్పుకొచ్చాడు. ఈ సిరీస్‌లో ఓడినా కెప్టెన్‌గా కొనసాగుతానని తెలిపాడు.



# 24 బంతుల్లోనే 10 భారీ సిక్సర్లు..
## వైభవ్ సూర్యవంశీ ఊచకోత

గతేడాది ఐపీఎల్‌లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇప్పుడు 2026 ప్రారంభంలోనే సౌతాఫ్రికా పర్యటనలో తన విశ్వరూపాన్ని చూపించాడు. అక్కడ జరుగుతున్న అండర్ 19 వన్డే సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో కేవలం 24 బంతుల్లోనే 10 భారీ సిక్సర్లతో 68 పరుగులు చేసి ఊచకోత కోశాడు. విదేశీ గడ్డపై, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లకు అనుకూలించే సౌతాఫ్రికా పిచ్‌లపై ఈ రేంజ్ హిట్టింగ్ చూసి క్రికెట్ పండితులు నోరెళ్లబెడుతున్నారు. ఇది సౌతాఫ్రికాలో వైభవ్‌కు నమోదైన తొలి 50 స్కోరు కావడం విశేషం. వైభవ్ సూర్యవంశీ కేవలం పరుగులు సాధించడమే కాకుండా, తన దేశం కోసం ఒక భారీ కానుకను సిద్ధం చేస్తున్నాడు. మార్చి 27న వైభవ్ తన 15వ పుట్టినరోజు జరుపుకోనున్నాడు. అయితే ఆ పర్వదినం కంటే ముందే భారత్‌కు అండర్ 19 వరల్డ్ కప్ ట్రోఫీని గిఫ్ట్‌గా ఇవ్వాలని కంకణం కట్టుకున్నాడు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జింబాబ్వే, నమీబియా వేదికలుగా ఈ మెగా టోర్నీ జరగనుంది. ఈ టోర్నీలో వైభవ్ తన బ్యాట్‌తో గనుక భారత్‌ను విజేతగా నిలబెడితే, అతి చిన్న వయసులో అండర్ 19 వరల్డ్ కప్ గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. వైభవ్ ఆడుతున్న విధానం చూస్తుంటే టీమిండియాకు మరో విధ్వంసకర ఓపెనర్ దొరికాడనే భావన కలుగుతోంది. ఇప్పుడు అదే ఫామ్‌ను 2026కి కూడా మోసుకొచ్చాడు.

## సర్ఫరాజ్‌ఖాన్‌మెరుపులు వృధా..

**విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో పెను సంచలనం నమోదైంది. దేశవాళీ క్రికెట్ రారాజుగా వెలుగొందుతున్న ముంబై జట్టుకు పంజాబ్ షాకిచ్చింది. గెలుపు ముంగిట బోల్తా పడ్డ ముంబై, కేవలం 1 పరుగు తేడాతో అనూహ్య ఓటమిని మూటగట్టుకుంది. శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్ వంటి స్టార్ ప్లేయర్లు ఉన్నా కూడా..ఆఖరి నిమిషంలో పంజాబ్ బౌలర్లు చూపించిన తెగువకు ముంబై బ్యాటర్లు చేతులెత్తేశారు. జైపూర్‌లోని జైపురియా విద్యాలయ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ముంబై బౌలర్ల ధాటికి పంజాబ్ బ్యాటర్లు తడబడ్డారు. రమణ్‌దీప్ సింగ్ (72), అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (57) మాత్రమే పోరాడటంతో పంజాబ్ 45.1 ఓవర్లలో 216 పరుగులకే ఆలౌట్ అయింది. ముంబై బౌలర్లలో ముషీర్ ఖాన్ 3 వికెట్లతో రాణించగా, శివం దూబే, శశాంక్ అట్టార్డే తలా రెండు వికెట్లు తీశారు. 217 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబైకి శుభారంభం దక్కింది. ముషీర్ ఖాన్, అంగ్‌క్రిష్ రఘువంశీ మొదటి వికెట్‌కు 57 పరుగులు జోడిరచారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్ కేవలం 20 బంతుల్లో 62 పరుగులు చేసి పంజాబ్‌ను భయపెట్టాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా 45 పరుగులతో రాణించడంతో ముంబై విజయం ఖాయమని అందరూ భావించారు. ఒక దశలో ముంబై 4 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. అంటే చేతిలో 6 వికెట్లు ఉన్నాయి.. చేయాల్సింది కేవలం 25 పరుగులు మాత్రమే! గెలుపు ముంగిట ఉన్న ముంబైకి పంజాబ్ బౌలర్లు నరకం చూపించారు. గుర్నూర్ బ్రార్, మయాంక్ మార్కండే నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడ్డారు.**

## నిబంధనలను ఉల్లంఘించిన పాండ్యా

**భారత స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్ళీ వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి తన ఆటతోనే కాకుండా, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో చర్చనీయాంశమయ్యారు. విజయ్ హజారే ట్రోఫీలో బరోడా తరపున ఆడుతున్న పాండ్యా, చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టినప్పటికీ, బోర్డు పెట్టిన ఒక ముఖ్యమైన నిబంధనను పక్కన పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. నిజానికి న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం టీమిండియాను సెలక్ట్ చేసినప్పుడు హార్దిక్ పాండ్యా 10 ఓవర్ల బౌలింగ్ చేయడానికి ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్ కాలేదని బీసీసీఐ స్పష్టం చేసింది. రాబోయే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని పాండ్యాను జాగ్రత్తగా కాపాడుకోవాలని నేషనల్ క్రికెట్ అకాడమీ, సెలక్టర్లు భావించారు. కానీ విజయ్ హజారే ట్రోఫీలో చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ ఏకంగా 10 ఓవర్ల కోటాను పూర్తి చేశారు. ఈ 10 ఓవర్లలో 66 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టారు. బోర్డు వారించినా కూడా పాండ్యా ఇంత రిస్క్ తీసుకోవడం ఇప్పుడు చర్చకు దారితీసింది. బౌలింగ్‌లో నిబంధనలు పక్కన పెట్టిన పాండ్యా, బ్యాటింగ్‌లో మాత్రం తన విశ్వరూపం చూపించారు. కేవలం 31 బంతుల్లోనే 75 పరుగులు చేసి మైదానంలో పరుగుల వరద పారించారు. ఇతని ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 2 ఫోర్లు ఉన్నాయి. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా న్యూజిలాండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌కు సిద్ధమవుతున్నారు.**

## సెమీఫైనల్లో నిఖత్ జరీన్

**సీనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ బిడ్డ నిఖత్ జరీన్ దుమ్మురేపుతోంది. ప్రత్యర్థులపై పంచ్‌లు కురిపిస్తూ సెమీఫైనల్‌లోకి దూసుకెళ్లింది.గ్రేటర్ నోయిడాలోని గౌతమ్ బుద్ధ యూనివర్శిటీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టూ టైమ్ వరల్డ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌తో పాటు వరల్డ్‌కప్ గోల్డ్ మెడలిస్ట్ హితేష్ గులియా, వరల్డ్ ఛాంపియన్ మీనాక్ష హుడా విజయం సాధించి సెమీఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. మహిళల 45-48 కేజీల విభాగంలో ఆలిండియా పోలీస్ తరపున బరిలోకి దిగిన మీనాక్ష 5-0తో పంజాబ్ బాక్సర్ కాశిష్ మెహతాను ఓడిరచింది. మహిళల 48-51 కేజీల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ 5-0తో మణిపూర్‌కు చెందిన లాంచెన్‌బీ చాను టోంగ్‌బ్రామ్‌ను చిత్తు చేసింది. మహిళల 51-54 కేజీల విభాగంలో ప్రీతి 5-0తో హర్మీత్ కౌర్‌పై, సాక్ష 4-1తో పూనమ్‌పై విజయం సాధించారు.**

# మహిళల ప్రీమియర్ లీగ్ 2026కు రంగం సిద్ధం

### నేటి నుంచే డబ్ల్యూపీఎల్ నాలుగవ సీజన్..

మహిళల క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డబ్ల్యూపీఎల్ 2026 సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. గతేడాది ఆసియా కప్ విజయం తర్వాత భారత మహిళల జట్టు మీద అంచనాలు పెరగగా, ఈ లీగ్ ద్వారా మరింత మంది యువ క్రీడాకారిణులు వెలుగులోకి రానున్నారు. జనవరి 9న డిఫెండిరగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ మరియు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగే మ్యాచ్‌తో ఈ టోర్నీకి తెరలేవనుంది. వేదికలు: ఈసారి టోర్నీ రెండు ప్రధాన నగరాల్లో జరగనుంది. మొదటి 11 మ్యాచ్‌లు నవీ ముంబైలోని డి.వై.పాటిల్ స్టేడియంలో, మిగిలిన మ్యాచ్‌లు (ఎలిమినేటర్ మరియు ఫైనల్‌తో సహా) వడోదరలోని బి.సి.ఎ స్టేడియంలో నిర్వహించనున్నారు.
ఇప్పటి వరకు జరిగిన మూడు సీజన్లలో ఒకసారి విజేతగా నిలిచిన ఆర్‌సీబీ.. మరో టైటిల్ పై కన్నేసింది.అరంగేట్ర సీజన్‌తో పాటు గత సీజన్‌లో ఆర్‌సీబీ పేలవ ప్రదర్శనతో పాయింట్స్ టేబుల్‌లో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ క్రమంలోనే నాలుగో సీజన్‌లో ఎలాగైనా టైటిల్ గెలవాలనే కసితో జట్టును ప్రక్షళన చేసిన ఆర్‌సీబీకి టోర్నీ ఆరంభానికి ముందే బిగ్ షాక్ తగిలింది. స్టార్ ప్లేయర్ ఎల్లీస్ పెర్రీ గాయంతో ఈ సీజన్‌కు దూరమైంది. ఆమె స్థానాన్ని సాయలీ సత్ఘరే అనే భారత ఆల్ రౌండర్‌తో ఆర్‌సీబీ భర్తీ చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్) సీజన్ 4కు రంగం సిద్ధమైంది. డిఫెండిరగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ హ్యాట్రిక్ టైటిల్ పై గురిపెట్టగా ఆ జట్టుకు ఈసారి బెంగళూరు, గుజరాత్‌లనుంచి గట్టి పోటీ ఎదురు కానుంది. ఆడిన మూడు సీజన్‌లలో రెండు సార్లు సునాయాసంగా టైటిల్ చేజిక్కించుకున్న ముంబయికి 2024లో తొలిసారి స్మృతి మంధాన సారథ్యంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చెక్ పెట్టింది. దీంతో ఆ జట్టు తొలిసారి టైటిల్‌ను సాధించింది.
గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా 5జట్ల మధ్య డబ్ల్యుపిఎల్ సంగ్రామం జరగనుండగా.. టోర్నీలో మొత్తం 22మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈసారి నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియం, వడోదరలోని బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడి యంలో మాత్రమే డబ్ల్యుపిఎల్ లీగ్ జరుగుతుంది. మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరగాలన్న ఉద్దేశ్యంతో బిసిసిఐ టికెట్‌ను కేవలం 100 రూపాయల ప్రారంభ ధరగా నిర్ణయించింది. 9న డిఫెండిరగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య డివై పాటిల్ స్టేడియం, నవీ ముంబయిలో జరుగుతుంది. ఆ తర్వాత జనవరి 10న డబుల్ హెడర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆ రోజు తొలి మ్యాచ్‌లో యుపి వారియర్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య, రెండో మ్యాచ్ ముంబయి ఇండియన్స్, ఢల్లీక్యాపిటల్స్ మధ్య జరగనున్నాయి. ఫిబ్రవరి 1తవరకు డబుల్ రౌండ్ రాబిన్ మ్యాచ్‌లు జరుగుతాయి. గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను నియమించింది. అంతర్జాతీయ క్రిట్‌లో సుదీర్ఘ అనుభవమున్న ఇంగ్లండ్ వెటరన్ సారా టేలర్‌కు ఫీల్డింగ్ కోచ్ బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని మంగళవారం ఎక్స్ వేదికగా ఫ్రాంచైజీ ప్రకటించింది. 13ఏళ్ల కెరీర్‌కు 2019లో వీడ్కోలు పలికింది. మూడు ఫార్మట్లలో 226 మ్యాచులు ఆడిన సారా 6,500 పరుగులు సాధించింది. మహిళా క్రిట్‌కు విశేష సేవలందించిన ఆమెకు 2025లో ఐసిసి హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. అనంతరం కోచ్‌గా కౌంటీల్లో ఇంగ్లండ్ సీనియర్ జట్టుకు సేవలందించింది. జూనియర్ టీమ్ ఇంగ్లండ్ లయన్స్‌కు కోచింగ్ ఇచ్చిన సారా ఫీల్డింగ్ ప్రమాణాలు నెలకొల్పింది. దాంతో.. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ కోసం ఆమెను గుజరాత్ జెయింట్స్ యాజమాన్యం సంప్రదించింది. జనవరి 10న యూపీ వారియర్స్‌తో గుజరాత్ తలపడనుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో మ్యాచ్ జరుగనుంది.

**ఆర్‌సీబీ తుది జట్టు (అంచనా)**

**స్మృతి మంధాన, జార్జియా వోల్, దయాలన్ హేమలత, గ్రేస్ హారిస్, రిచా ఘోష్(కీపర్), నడిన్ డిక్లెర్క్, పూజా వస్త్రాకర్, శ్రేయాంక్ పాటిల్, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి, లారెన్ బెల్/ లిన్సే స్మిత్**

**ఆర్‌సీబీ (మహిళల) పూర్తి జట్టు**

**స్మృతి మంధాన, రిచా ఘోష్, సాయలీ సత్ఘరే, శ్రేయాంక పాటిల్, జార్జియా వోల్, నడిన్ డి క్లెర్క్, రాధా యాదవ్, లారెన్ బెల్, ప్రేమ రావత్, అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్, గ్రేస్ హారిస్, గౌతమి నాయక్, ప్రాత్యూష కుమార్, దయాలన్ హేమలత.**

### పూర్తి షెడ్యూల్ ఇదే..

**1. జనవరి 9 ఉ ముంబై ఇండియన్స్ జం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (నవీ ముంబై)**
**2. జనవరి 10 ఉ యుపి వారియర్జ్ జం గుజరాత్ జెయింట్స్ (నవీ ముంబై)**
**3. జనవరి 10 ఉ ముంబై ఇండియన్స్ జం ఢిల్లీ క్యాపిటల్స్ ( నవీ ముంబై)**
**4. జనవరి 11 ఉ ఢల్లీక్యాపిటల్స్ జం గుజరాత్ జెయింట్స్ (నవీ ముంబై)**
**5. జనవరి 12 ఉ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జం యుపి వారియర్జ్, (నవీ ముంబై)**
**6. జనవరి 13 ఉ ముంబై ఇండియన్స్ జం గుజరాత్ జెయింట్స్ ( నవీ ముంబై)**
**7. జనవరి 14 ఉ యుపి వారియర్జ్ జం ఢిల్లీ క్యాపిటల్స్ ( నవీ ముంబై)**
**8. జనవరి 15 ఉ ముంబై ఇండియన్స్ జం యుపి వారియర్జ్ ( నవీ ముంబై)**
**9. జనవరి 16 ఉ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గుజరాత్ జెయింట్స్ ( నవీ ముంబై)**
**10. జనవరి 17 ఉ యుపి వారియర్జ్ జం ముంబై ఇండియన్స్ ( నవీ ముంబై)**
**11. జనవరి 17 ఉ ఢిల్లీ క్యాపిటల్స్ జం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( నవీ ముంబై)**
**12. జనవరి 19 ఉ గుజరాత్ జెయింట్స్ జం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( వడోదర)**
**13. జనవరి 20 ఉ ఢిల్లీ క్యాపిటల్స్ జం ముంబై ఇండియన్స్ ( వడోదర)**
**14. జనవరి 22 ఉ గుజరాత్ జెయింట్స్ జం యుపి వారియర్జ్ ( వడోదర)**
**15. జనవరి 24 ఉ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జం ఢిల్లీ క్యాపిటల్స్ ( వడోదర)**
**16. జనవరి 26 ఉ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జం ముంబై ఇండియన్స్ ( వడోదర)**
**17. జనవరి 27 ఉ గుజరాత్ జెయింట్స్ జం ఢల్లీక్యాపిటల్స్ ( వడోదర)**
**18. జనవరి 29 ఉ యుపి వారియర్జ్ జం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( వడోదర)**
**19. జనవరి 30 ఉ గుజరాత్ జెయింట్స్ ముంబై ఇండియన్స్ (వడోదర)**
**20. ఫిబ్రవరి 1 ఉ ఢిల్లీ క్యాపిటల్స్ జం యుపి వారియర్జ్ (వడోదర)**
**21. ఫిబ్రవరి 3 ఉ ఎలిమినేటర్ (వడోదర)**
**22. ఫిబ్రవరి 5 ఉ ఫైనల్ ( వడోదర)**



# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అనగనగా ఒక రాజు




రాజుగారి పెళ్లి ఏడుతరాలు గుర్తుండిపోతుందంటూ నవ్వులు పూయిస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన ప్రధానపాత్రలో మారి తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు' . మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా సందడి చేయనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో నవీన్ తన మార్క్ కామెడీతో ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలు అందించిన నవీన్ ఇప్పుడు అనగనగా ఒకరాజుతో వస్తున్నాడు.



## భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో వస్తోన్న రవితేజ

భర్త మహాశయులకు విజ్ఞప్తి అంటూ ఈ సంక్రాంతికి సందడి చేయడానికి రవితేజ సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథానాయికలు. జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇద్దరి భామల మధ్య నలిగిపోతోన్న వ్యక్తిగా రవితేజ తన మార్క్ కామెడీతో అలరిస్తున్నారు. ఇటీవల వరుస పరాజయాలతో ఉన్న రవితేజ ఇప్పుడు ఈసినామపై ఆశలు పెట్టుకున్నారు. ఇది విజయవంతం కావాలని కోరుకుంటున్నాడు.

# మన శంకర్ వరప్రసాద్ గారు హుక్‌స్టెప్ సాంగ్



చిరంజీవి కథానాయకుడి అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషించారు. జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రంలో 'హుక్ స్టెప్' సాంగ్‌ను విడుదల చేశారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఈ సాంగ్‌ను టెలికాస్ట్ చేయగా, అభిమానులే కాదు, వెంకటేశ్, అనిల్ రావిపూడి కూడా ఈ పాటకు డ్యాన్స్ వేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చిన ఈపాటను బాబా సెహగల్ ఆలపించారు. ఇప్పటివరకూ ఈ చిత్రం నుంచి వచ్చిన పాటల్లో ఇదే హైలైట్ కావడం గమనార్హం. అంతేకాదు, సోషల్‌మీ డియాను కూడా ఓ ఊపు ఊపేయడం ఖాయం.

# ఏపీలో పెరిగిన టికెట్ ధరలు




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బ్జడెట్ మూవీ 'ది రాజా సాబ్' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది, మారుతి దర్శకత్వంలో హారర్`కామెడీ జోనర్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ వింటేజ్ లుక్ ఇప్పటికే సోషల్ మీ డియాను షేక్ చేస్తోంది. ఈ సినిమా టికెట్ ధరల పెంపు మరియు బెనిఫిట్ షోలకు సంబంధించి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా బెనిఫిట్ షోలకు, తర్వాత పది రోజుల పాటు టికెట్ రేట్లను పెంచుతూ ఒక జీవో జారీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కానీ తెలంగాణలో మాత్రం ఆ జీవో ఇంకా రాలేదు. రాత్రికే బెనిఫిట్ షోలు, ప్రీమియర్స్ వేయాల్సి ఉండగా ఆ జీవో ఇంకా రాలేదు. అయితే కోర్టు సమయం ముగిశాక ఆ జీవో జారీ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. సాధారణంగా ఏదైనా పెద్ద సినిమాకు ప్రభుత్వం రేట్లు పెంచుతూ జీవో ఇచ్చిన వెంటనే, కొందరు కోర్టులో పిటిషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల బుకింగ్స్ ఆగిపోవడం లేదా చివరి నిమిషంలో చిక్కులు ఎదురవడం వంటివి జరుగుతుంటాయి. ప్రభుత్వ జీవో వెలువడిన వెంటనే థియేటర్ యాజమాన్యాలు బుక్‌మైషో సహా ఇతర పోర్టల్స్‌లో బుకింగ్స్ జరిగేలా డేటాను అప్‌డేట్ చేస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం, నేడు సాయంత్రం 5:30 నుండి 6:00 గంటల మధ్య 'ది రాజా సాబ్' అడ్వాన్స్ బుకింగ్స్ పూర్తిస్థాయిలో ఓపెన్ అయ్యే అవకాశం ఉంది. ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బెనిఫిట్ షోలకు (అర్ధరాత్రి లేదా తెల్లవారుజాము షోలు) కూడా లైన్ క్లియర్ అయింది. ఆంధప్రదేశ్‌లోని ప్రధాన కేంద్రాలలో ఈ షోల కోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం అనుమతి కూడా దాదాపు ఖాయం కావడంతో ఇప్పుడు రికార్డు స్థాయి వసూళ్లపై చిత్ర యూనిట్ ధీమాగా ఉంది.

# నేడు థియేటర్లలోకి ది రాజాసాబ్ మూవీ

మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ చేస్తూ వచ్చానని మార్పు కోసమే 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేశానని అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ఇది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నేడు సినిమా విడుదల కానుండడంతో థియేటర్ల వద్ద ప్రభాస్ అభిమానుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగాతో ప్రభాస్, కథానాయికలు ముచ్చటించారు. సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒక తరహా కథలకు అలవాటు పడిన హీరోలు అంత త్వరగా మార్పును కోరుకోరని, 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేయడానికి కారణం ఏంటని ప్రభాస్‌ను సందీప్ అడిగారు. అందుకు ఆయన స్పందిస్తూ.. 'నా కెరీర్ మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ ఎక్కువగా చేశా. ఒకే జానర్ ఫిల్మ్స్ చేసి బోర్ కొట్టేసింది. ఆ మార్పు కోసమే 15ఏళ్ల కిందట 'డార్లింగ్' చేశా. 'ఇది వర్కవుట్ అయ్యే సినిమా కాద'ని అందరూ అన్నారు. కానీ, బాగా ఆడిరది. ఇప్పుడు భారతీయ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి. అందుకే ఇది ప్రయత్నించా. ఇది బామ్మ`మనవడి కథ. ఇందులో బామ్మ భర్త విలన్. అనుకోని పరిస్థితుల్లో ఆ పాడుబడిన మహల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అది ఎందుకనేది సినిమా చూడాలి. ఇందులో 'ది రాజాసాబ్'గా నటించేది నేనే. సినిమా ప్రారంభ సమయంలో రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. చివరకు 'ది రాజాసాబ్' ఓకే చేశాం'అని ప్రభాస్ చెప్పారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' మూవీ పోస్టర్ గురించి చర్చ జరిగింది. 'బాహుబలి' చేసిన ఒక హీరోను ఎలా ప్రజెంట్ చేయాలా? అని చాలా ఆలోచించి ఇప్పుడున్న లుక్‌ను విడుదల చేశాం. ప్రభాస్ చేతిలో ఉన్న గ్లాస్ గురించి సోషల్‌మీ డియా బాగానే చర్చ జరిగింది. అది ఒక లీటర్ బాటిల్. ఆయన చేతిలో అది గ్లాస్‌లాగానే కనిపిస్తుంది. ఆ సీన్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది. పోస్టర్‌లో ఎక్కువగా తెలుపు మాత్రమే హైలైట్ అయింది. అందుకే మద్యం ఉన్న బాటిల్ అందరి దృష్టిలో పడిరదని సందీప్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.



# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈ సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్` త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్ తో రూ.1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో వినిపించింది. . త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎందుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ ` త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.